
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
అన్నమయ్య
జిల్లా వార్తలు
గురువారం 17 అక్టోబరు 2024



కుండపోత

- నీట మునిగిన పంటలు
- ఇళ్లు, వ్యాపార దుకాణాల్లోకి నీరు
- నేలవాలిన పంటలు, కూలిన ఇంటి గోడలు
- రెడ్డివారిపల్లె-రైల్వేకోడూరుకు రాకపోకలు బంద్
- ధ్వంసమైన కడప-చెన్నై రోడ్డు
- వరద ప్రాంతాల్లో పర్యటించిన ఎమ్మెల్యే శ్రీధర్, సబ్ కలెక్టర్ నిదియాదేవి



కోడూరు గుంజన నది వద్ద ప్రజలను వెళ్లనివ్వకుండా అధికారుల గస్తీ



రైల్వేకోడూరు మండలం ఉప్పరపల్లెలో అరటి పంటలోకి చేరిన వరద నీరు



రైల్వేకోడూరులో వరద ప్రాంతాలలో పర్యటిస్తున్న రాజంపేట సబ్ కలెక్టర్ నిదియాదేవి, ఎమ్మెల్యే అరవ శ్రీధర్



రైల్వేకోడూరు-రెడ్డివారిపల్లె మధ్య గుంజననది ప్రవాహం



ఓబులవారిపల్లె మండలంలో పాములేరుకు చేరుతున్న వరదనీరు

రాజంపేట/రైల్వేకోడూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : అల్పపీడన ద్రోణి ప్రభావం రాజంపేట డివిజన్‌పై ఎక్కువ ప్రభావం చూపుతోంది. జిల్లాలోని రాయచోటి, పీలేరు, మదనపల్లె నియోజకవర్గాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. ఈ ప్రాంతాల్లో తుఫాను ప్రభావం పెద్దగా లేదు. ప్రధానంగా రైల్వేకోడూరు మండలంలో కుండపోత వాన కురిసింది. ఇప్పటికే కోడూరులో అత్యధిక వర్షపాతం నమోదైంది. తిరుమల గిరుల్లో భారీ వర్షాలు కురుస్తుండడంతో ఆ నీరు గుంజనేరుకు చేరడంతో గుంజనేరు ఉగ్రరూపం దాల్చుతూ కోడూరు వైపు పయనిస్తోంది. దీనివల్ల కోడూరు, రెడ్డివారిపల్లె ప్రాంతాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. అదేవిధంగా ఓబులవారిపల్లె మండలంలోని పాములేరుకు వరద నీరు ఎక్కువగా చేరుతోంది. బుధవారం సాయంత్రానికి రైల్వేకోడూరులో సుమారు 150 మి.మీ., ఓబులవారిపల్లెలో 100 మి.మీ., రాజంపేటలో 60 మి.మీ, చిట్వేలిలో 70 మి.మీ, నందలూరులో 60 మి.మీ వర్షపాతం నమోదైంది. రైల్వేకోడూరు నియోజకవర్గంలో బుధవారం తెల్లవారుజాము నుంచి కుండపోత వర్షం కురిసింది. దీంతో రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి, పుల్లంపేట, పెనగలూరు మండలాల్లో బొప్పాయి, అరటి, మామిడి పంట తోటల్లోకి వర్షం నీరు చేరింది. రైల్వేకోడూరు మండలంలోని గుండాలపల్లె, బయనపల్లె గ్రామాల్లో సుమారు 40 లక్షల అంటు మొక్కలు నీటమునిగిపోవడంతో లక్షలాది రూపాయల నష్టం వాటిల్లిందని రైతులు తెలిపారు. చీనీ, నిమ్మ అంట్లు మొక్కల్లో నీరు నిలబడితే అంట్లు కుళ్లిపోతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. బయనపల్లె గ్రామం సమీపంలో వేసిన సజ్జ పంట వర్షం దెబ్బకు నేలవాలింది. శెట్టిగుంట, ఉప్పరపల్లె, మాధవరంపోడు, ఎస్.కొత్తపల్లె, ఉర్లగట్టుపోడు, రాఘవరాజపురం, బయనపల్లె, వీవీకండ్రిక, తిమ్మిశెట్టిపల్లె, అనంతరాజుపేట, నారాయణరాజుపోడు, కె.బుడుగుంటపల్లె, వీపీఆర్ కండ్రిక తదితర గ్రామాల్లో ఎక్కువగా పంట పొలాల్లోకి నీరు చేరిందని రైతులు తెలిపారు. అరటి చెట్లు ఎక్కువగా నానితే పడిపోతాయని రైతులు తెలిపారు. బొప్పాయి పూర్తిగా పనికి రాకుండాపోతుందని రైతులు తెలిపారు. శెట్టిగుంట గిరిజన కాలనీని వరద నీరు చుట్టుముట్టింది. గిరిజనుల ఇళ్లలోకి వరద నీరు ప్రవేశించింది. రైల్వేకోడూరు పట్టణంలో వ్యాపార దుకాణాలు, అంకమ్మనగర్‌లో పలువురి ఇళ్లలోకి నీరు ప్రవేశించింది. పట్టణంలోని రామ్‌నగర్‌లో అరుణ, ప్రసాద్‌లకు చెందిన గుడిసె ఇంటి గోడలు వర్షం దెబ్బకు కూలిపోయాయి. ఆర్టీసీ బస్టాండు వద్ద భారీగా వరద నీరు చేరడంతో వాహనదారులు పలు ఇక్కట్లు పడ్డారు. ప్రధాన దారిలో వరద నీరు ఏరులై ప్రవహించింది. రవీంద్రభారతీ స్కూలు వెనక భాగంలో ఉన్న వీధులు జలమయం అయ్యాయి. రెడ్డివారిపల్లెకు వెళ్లే మార్గంలో కొంత కాలంగా బ్రిడ్జి పనులు సాగుతున్నాయి. దీంతో వరద నీటి ప్రవాహం ఎక్కువ కావడంతో రెడ్డివారిపల్లె-రైల్వేకోడూరు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో అగ్రహారం, పాటిమీదిపాళెం తదితర గ్రామాల మీదు గా రైల్వేకోడూరుకు రాకపోకలు సాగిస్తున్నారు. కోడూరులోనే ఎక్కువ అల్పపీడన ప్రభావం ఉండడంతో శ్రీనివాసపురం, నారాయణస్కూల్, జానకిపురం, శెట్టిగుంట, గంగిరెడ్డుమిట్ట ప్రాంతాల్లో సహాయ శిబిరాలు ఏర్పాటు చేశారు. అన్ని ప్రాథమిక కేంద్రాల్లో ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలు ఏర్పాటు చేశారు. రాజంపేట సబ్‌కలెక్టర్ నిధియాదేవి నేతృత్వంలో డీఎస్పీ సుధాకర్, డీఎంహెచ్‌వో కొండయ్య, రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ నేతృత్వంలో అన్ని శాఖల అధికారులు కోడూరులో మకాం వేసి అన్ని చర్యలు తీసుకుంటున్నారు. అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామ కార్యదర్శులను ఏర్పాటు చేశారు. ఎప్పటికప్పుడు హెల్ప్‌లైన్ కేంద్రాలకు సమాచారం అందించాలని ఆదేశాలు ఇచ్చారు. నదీ పరివాహక ప్రాంతాల్లో ప్రజలు అటువైపు వెళ్లకుండా ప్రత్యేక అధికార బృందాన్ని ఏర్పాటు చేశారు.



రాజంపేట మండలం భోయనపల్లె వద్ద దెబ్బతిన్న రోడ్డు

కడప-చెన్నై రోడ్డుతో పాటు అన్ని రోడ్లు ధ్వంసం

భారీ వర్షానికి కడప నుంచి చెన్నైకి వెళ్లే రోడ్డు అంతా గుంతలమయమైంది. కడప నుంచి రేణిగుంట వరకు వెళ్లే రోడ్డులో వర్షపునీటి వల్ల పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి వాహనాలు వెళ్లడానికి ఇబ్బందులు కలుగుతున్నాయి. రాజంపేట మండలంలోని ఆకేపాడు, తాళ్లపాక, మదనగోపాలపురం, చిట్వేలి, రాయచోటి తదితర ప్రాంతాలకు వెళ్లే పంచాయతీ రోడ్లన్నీ పాడైపోయాయి. పెద్ద పెద్ద గుంతలు ఏర్పడడంతో వాహనదారులు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు.

నేలపాలైన వరి

రాజంపేట మండలంలోని మదనగోపాలపురం, తాళ్లపాక, గుండ్లూరు పులపత్తూరు, మందరం, మందపల్లె, నందలూరు మండలంలోని పొత్తపి, పాటూరు, నాగిరెడ్డిపల్లె, లేబాక, పెనగలూరు మండలంలోని ఓబిలి, నారాయణనెల్లూరు, జెట్టివారిపల్లె, టంగుటూరు తదితర చెయ్యేరు నదీ పరివాహక ప్రాంతాల్లో వరిపంట అంతా కోతదశలో ఉండగా పూర్తిగా నేలమట్టమైంది. దీనివల్ల వరిసాగు చేసిన అన్నదాతలకు భారీ నష్టం వాటిల్లింది. కోసిన వరి పంటను ఇంటికి చేర్చుకోలేక మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వరిపంట అంతా నీటిపాలైంది. అదేవిధంగా పుల్లంపేట, ఓబులవారిపల్లె, చిట్వేలి, పెనగలూరు, కోడూరు మండలాల్లో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల అరటి, బొప్పాయి వరి పంటలు సాగు చేసిన రైతులకు భారీ నష్టం కలగనుంది. పంట పొలాల్లో వర్షపునీరు నిల్వ ఉండడం వల్ల అరటి, బొప్పాయి పంటలు పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉంది. సుమారు 20 వేల ఎకరాల్లో అరటి, మరో 20 వేల ఎకరాల్లో బొప్పాయి పంటను సాగు చేసి ఉన్నారు. బుధవారం రాత్రికి తుఫాను తీవ్రత ఎక్కువ కావడంతో రైల్వేకోడూరుతో పాటు రాజంపేట సబ్‌కలెక్టర్ కార్యాలయంలో హెల్ప్‌లైన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. సబ్‌కలెక్టర్ కార్యాలయంలో డివిజన్‌లో కంట్రోల్ రూము ఏర్పాటు చేసి 085650240079ను సంప్రదిస్తే వెంటనే సహాయ చర్యలు చేపడతామని సబ్‌కలెక్టర్ తెలిపారు. రాజంపేటలో ఎర్రబల్లె, రామచంద్రాపురం, క్రిష్ణానగర్, ఈడిగపాళెం, మన్నూరు చుట్టుపక్కల ప్రాంతాల్లో వరదనీరు చేరడంతో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పోలా శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో కమిషనర్ నాగేశ్వరరావు ఇతర సిబ్బంద్రి పత్యేక జేసీబీ యంత్రాలను ఏర్పాటు చేసి నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టారు. ఎప్పటికప్పుడు మున్సిపల్ సిబ్బందిని సచివాలయ సిబ్బందిని ఆయా ప్రాంతాల్లో అప్రమత్తం చేశారు.



రైల్వేకోడూరు మండలం గుండాలపల్లె లో నీటమునిగిన నిమ్మ మొక్కలు



రాజంపేట మండలం పోలి వద్ద పూర్తిగా నేలవాలిన వరి పంట



రైల్వేకోడూరు పట్టణం ఆర్టీసీ బస్టాండు వద్ద చేరిన భారీ వరద నీరు



రైల్వేకోడూరు బయనపల్లె వద్ద బొప్పాయి తోటలోకి చేరిన నీరు



జలమయమైన రైల్వేకోడూరు ప్రధాన దారి



కనుగొండ అటవీ ప్రాంతంలో నేలమట్టమైన అభయాంజనేయస్వామి ఆలయం

నేలమట్టమైన అభయాంజనేయస్వామి ఆలయం

- ఆధారాల కోసం కనుగొండను జల్లెడపడుతున్న పోలీసులు
- సీఎం చంద్రబాబు స్పందన.. కఠిన చర్యలకు ఆదేశం

ములకలచెరువు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ములకలచెరువు సమీపంలోని కనుగొండ అటవీ ప్రాంతంలోని అభయాంజనేయస్వామి ఆలయం నేలమట్టమైంది. ఆలయాన్ని రిగ్గులు (పేలుడు పదార్థాలు) ద్వారా పేల్చివేసేందుకు దుండగులు యత్నించడం, తుఫాను కారణంగా కురుస్తున్న వర్షానికి రిగ్గులు పేలకపోవడంతో సమ్మెటలతో కొట్టడంతో ఆలయం గోడలు పూర్తిగా దెబ్బతిని ఒరిగిపోయిన విషయం విదితమే. ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. లోపల కొంత సపోర్టుతో పడిపోకుండా నిలబడ్డ ఆలయం బుధవారం తెల్లవారుజామున పూర్తిగా కూలిపోయింది. ఆలయం పడిపోవడంతో అభయాంజనేయస్వామి విగ్రహం శిథిలాల కింద పడిపోయింది. వర్షం కారణంగా ఆలయం పూర్తి స్థాయిలో నేలమట్టమైందని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. ఆలయ పూజారి విద్యాసాగర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. సీఐ రాజారమేష్, ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం ఎస్ఐలు గాయత్రి, నరసింహుడు నేలమట్టమైన ఆలయం చుట్టుపక్కల ఆధారాల కోసం అన్వేషించారు. ఘటన జరిగిన రోజు ఆలయం వద్దకు ఎవరెవరు వచ్చారన్న విషయాన్ని ఆరా తీస్తున్నారు. ఆలయ పూజారిపై కక్షతోనే ఇంతటి దారుణానికి పాల్పడినట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు విశ్వసనీయ సమాచారం. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయి లోకేష్, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పోతుల సాయినాథ్, బీజేపీ నేత గోపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు జయరాంరెడ్డి తదితరులు పడిపోయిన గుడిని పరిశీలించిన అనంతరం పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకుని ఆలయాన్ని కూల్చిన నిందితులను త్వరగా గుర్తించి అరెస్టు చేయాలని సీఐను కోరారు.

కఠిన చర్యలకు సీఎం చంద్రబాబు ఆదేశాలు

- నేలమట్టమైన స్థానంలో ఆలయాన్ని పునర్ నిర్మిస్తాం

అభయాంజనేయస్వామి ఆలయాన్ని నేలమట్టం చేసిన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖను ఆదేశించారని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి తెలిపారు. నేలమట్టమైన ఆలయాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిందితులను త్వరగా గుర్తించి ఎంతటివారైనా వదలకూడదని చంద్రబాబు ఆదేశించారన్నారు. నేలమట్టమైన స్థానంలో ఆలయాన్ని పునర్ నిర్మిస్తామని తెలిపారు. ఆలయం భద్రతకు సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఆయన వెంట నియోజకవర్గ ప్రచార సమన్వయకర్త సీడు మల్లికార్జుననాయుడు, టీడీపీ జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ కేవీ రమణ తదితరులు ఉన్నారు.



ఆలయాన్ని పరిశీలిస్తున్న టీడీపీ నేత జయచంద్రారెడ్డి, ఎస్ఐ గాయత్రి

ఏడాది పొడవునా టమోటా పంట సాగు చేస్తూ నష్టాలు చవిచూస్తున్న పడమటి ప్రాంత రైతులకు ఓ రైతు వంగ సాగులో లాభాలు రుచి చూపిస్తున్నారు. టమోటా సాగులో అవలంభించే కట్లు, తీగ పద్ధతిలోనే వంగ సాగును వినూత్నంగా చేపట్టి, మేలైన వంకాయలను అధిక దిగుబడితో పండించడమే కాకుండా వాటిని చెన్నైకు ఎగుమతి చేస్తున్నారు.


వినూత్నంగా సాగు చేసిన వంకాయ తోట


ఏపుగా కాసిన వంకాయలు

వినూత్నంగా వంగ సాగు

● ఎకరాకు రూ.5 లక్షల లాభం ● వంకాయలు చెన్నైకు ఎగుమతి

మదనపల్లె టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వంగ సాగులో రైతులు సాధారణ పద్ధతిలో సాగు చేస్తూ తెగుళ్ల, పురుగుల దెబ్బకు సరైన దిగుబడి రాక నష్టాల పాలైన సంఘటనలో కోకొల్లలు. అలాంటి వంగ పంటకు తెగుళ్ల దెబ్బపడకుండా, పురుగుల నుంచి కొత్త పద్ధతుల్లో రక్షణ కల్పిస్తూ అధిక దిగుబడులు సాధిస్తూ తోటి రైతులకు మార్గదర్శంగా నిలిచారు మదనపల్లె మండలం సీటీఎం గ్రామానికి చెందిన రైతు ఆనంద పార్థసారథి. సీటీఎం-పెద్దపల్లె మార్గంలో రెండెకరాల భూమిని లీజుకు తీసుకున్న ఆయన లోతు దుక్కులతో భూమిని దున్ని, ఆవుపేడ ఎరువులతో సారవంతం చేశారు. సాధారణ వంకాయల సాగుకు ప్రత్యామ్నాయంగా మంచి రంగు, పొడవు ఉండే వంకాయలను పండించడానికి నడుం బిగించాడు. నర్సరీ నుంచి ఉజాల రకం వంకాయ మొక్కలను కొనుగోలు చేసి తీసుకొచ్చాడు. దుక్కులు దున్నిన భూమిలో మల్చింగ్ పేపర్ వేసి ఎకరాకు 7 వేల చొప్పున మొక్కలు నాటారు. నాటిన మొక్కలకు డ్రిప్ పద్ధతిలో నీటిని అందిస్తూ అడుగు పొడవు పెరిగాక వంకాయ మొక్కలను పొడవుగా పెరిగేందుకు స్టాక్స్ (ప్లాస్టిక్ తీగలు) కట్టారు. పది అడుగులకు ఒకచోట కర్రలను నాటి, ఆ కర్రలకు ప్లాస్టిక్ తీగలు అడ్డంగా కట్టాడు. ఈ ప్లాస్టిక్ తీగల కిందికి జొన్నపుర్రిలకు వంకాయ మొక్కల రెమ్మలు కట్టి పైకి ఎగబాకేలా ఊతం ఇచ్చారు. నెల రోజుల్లో ఐదడుగుల ఎత్తు పెరిగిన వంగ మొక్కలు పూత పూయడం ప్రారంభించాయి. 30 నుంచి 50 రోజుల్లో పూత పిందె పట్టి, కాయలు కాయడం మొదలు పెట్టాయి.

ఈ రకం వంకాయ సాగును వేసవిలో సాగు చేస్తే తెగుళ్ల, చీడ పురుగుల బెడద లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవచ్చు. శీతాకాలంలో పురుగులు ఎక్కువగా పడే అవకాశం ఉంది. దీనిని బట్టి చూస్తే జనవరి నుంచి అక్టోబరు వరకు ఈ రకం వంగ పంట సాగుకు అనుకూలం. పచ్చదోమ తక్కువగా, తెల్లదోమలు ఎక్కువగా ఈ పంటను ఆశిస్తాయి. వీటిని గమనించుకుంటూ వారానికి ఒకసారి మందులు పిచికారీ చేస్తే, ఆరు నెలల పాటు వంకాయలు కోతలు పడతాయి.


పొడవైన వంకాయలు

ఎకరాకు 15 టన్నుల దిగుబడి

వంకాయ సాధారణ సాగులో ఎకరాకు 8 నుంచి 10 టన్నుల వంకాయలు మాత్రమే దిగుబడి వస్తుంది. అదే స్టాక్స్ పద్ధతిలో మేలు రకం వంకాయ సాగులో ఎకరాకు 15 టన్నుల దాకా దిగుబడి వస్తోంది. ఎకరా విస్తీర్ణం సాగులో తొలికోతలో 300 కిలోల దిగుబడి రాగా, తరువాత వరుస కోతల్లో 1000, 2000, 3500 కిలోల దాకా వంకాయలు పండుతున్నాయి. రెండు నెలల్లో 14 కోతలు కోయగా సరాసరిన 15 వేల కిలోలు వంకాయలు దిగుబడి వచ్చాయి.

లాభాల పంట

ఈ రకం వంకాయ సాగులో రైతులు లాభాలు చవిచూడొచ్చు. ఎకరా వంకాయ సాగుకు ఎకరాకు రూ.1.65 లక్షలు పెట్టుబడి పెట్టాల్సి వుంది. ఇలా సాగు చేసిన వంకాయ పంట ఎకరాకు 15 టన్నుల దిగుబడి వస్తుంది. చెన్నైలో కిలో వంకాయ రూ.30 కనీస ధర పలికినా రూ.4.50 లక్షలు వస్తుంది. ఖర్చులు పోను ఎకరాకు ఎంత లేదన్నా కనీసంగా రూ.3 లక్షలు లాభాలు వస్తున్నాయి. డిమాండ్ పెరిగితే ఒక్కోసారి హోల్‌సేల్ మార్కెట్‌లో కిలో వంకాయలు రూ.100 కూడా పలుకుతాయి. దీనిని బట్టి చూస్తే రైతులకు ఎకరాకు అన్ని ఖర్చులు పోను గ్యారెంటీగా రూ.5 లక్షలు వరకు లాభం వస్తుందని అంచనా.

పంట మార్పిడితోనే భూమి సారవంతం



ప్రతి ఏటా వ్యవసాయంలో రైతులు పంట మార్పిడితో భూమి సారవంతం చేయొచ్చు. అలాగే తెగుళ్ల, చీడ పీడలు అంతగా సోకే ఆస్కారం లేకుండా చేయొచ్చు. ఎంత వర్షాలు వచ్చినా ఎర్రరేగడి నేలలో టమోటా, వంకాయల సాగులో మొక్కలు నీటి నిల్వలను తట్టుకుంటాయి. మూడు రోజులకు ఒకసారి నీటి తడి అందిస్తే చాలు. వంకాయ మొక్కలు ఏపుగా పెరుగుతాయి. వంకాయ సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడి రావడమే కాకుండా, నాణ్యమైన వంకాయలు చేతికి అందుతాయి. మదనపల్లె ప్రాంతంలో ఈ రకం వంగ సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. కానీ ఇక్కడ మార్కెటింగ్ లేక చెన్నైకు రవాణా చేయాల్సి వస్తోంది. మదనపల్లెలో ప్రభుత్వం వంకాయ మార్కెట్ ఏర్పాటు చేస్తే రైతులకు రవాణా ఖర్చు తగ్గిపోయి, ఇంకా రాబడి పెరుగుతుంది.

- ఆనంద పార్థసారథి, రైతు, సీటీఎం గ్రామం.

మున్సిపల్ పూర్వ కమిషనర్ ఇంక్రిమెంట్లలో కోత

● మరో ఇద్దరు ఉద్యోగులకూ కోత....

కలికిరి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో గతంలో పనిచేసిన కమిషనరుతో సహా మరో ఇద్దరు ఉద్యోగులు భవన నిర్మాణాల అనుమతుల విషయంలో అక్రమాలకు పాల్పడ్డారనే కారణంతో రెండేసి ఇంక్రిమెంట్లలో కోత విధిస్తూ ప్రభుత్వం బుధవారం ఆదేశాలు చేసింది. 2021లో ప్రొద్దుటూరు మున్సిపల్ కమిషనరుగా పనిచేసిన పి.వి.వి.ఎస్. మూర్తి భవన నిర్మాణాలకు నిబంధనలకు విరుద్ధంగా అనుమతులిచ్చారని, అనధికార నిర్మాణాల తొలగింపు విషయంలో చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని, సెట్ బ్యాక్ నిబంధనలను అతిక్రమించినా పట్టించుకోలేదన్న అభియోగాలతో ఆయనకు గతంలో ప్రభుత్వం నోటీసులిచ్చింది. దీని పైన కమిషనరు ఇచ్చిన సంజాయిషీలు విచారణలో నిలవకపోవడంతో చివరికి రెండు వార్షిక ఇంక్రిమెంట్లలో కోత విధించాలని నిర్ణయించి ఆ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఇదే విధమై అభియోగాలతో జరిగిన విచారణలో అప్పట్లో మున్సిపాలిటీ టీపీఎస్‌గా పనిచేస్తున్న సి.టి.కృష్ణసింగ్, టీపీబీవోగా పనిచేస్తున్న ఎస్.మహబూబ్ బాషాలపై కూడా నిర్ధారణ కావడంతో ఇరువురి ఇంక్రిమెంట్లలో రెండేసి వంతున కోత విధించారు. ఈ మేరకు మున్సిపల్ వ్యవహారాలు, పట్టణాభివృద్ధి రాష్ట్ర ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అనిల్ కుమార్ సింఘాల్ బుధవారం విడివిడిగా ఆదేశాలు జారీ చేశారు.

పీటీడీ ఇంజనీరుకు కర్నూలు బాధ్యతలు

కడప ప్రజా రవాణా శాఖ (ఏపీఎస్‌ఆర్టీసీ)లో డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీరుగా పనిచేస్తున్న పి.ఎల్.భాస్కర్‌కు కర్నూలు పీటీడీ డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీరుగా అదనపు బాధ్యతలు అప్పగించారు. మూడు నెలల వరకు గానీ లేదా రెగ్యులర్ నియామకం జరిగే వరకు గానీ ఈ బాధ్యతలు నిర్వర్తించాలని రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

మెడికల్ కాలేజీ అసోసియేట్ ప్రొఫెసర్ కడపకు బదిలీ


మదనపల్లె ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పాథాలజీ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ స్పందనను ప్రభుత్వం బదిలీ చేసింది. కడప ప్రభుత్వ మెడికల్ కళాశాలలో అదే విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా నియమించింది. మానవతా దృక్పథంతో బదిలీలపై ఉన్న నిషేధాన్ని సడలించి ఆదేశాలిస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. అదే విధంగా కడప ప్రభుత్వ వైద్య కళాశాలలో ఈఎన్‌టీ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ బి.సుధను విజయనగరం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో అదే విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా బదిలీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు బుధవారం వేర్వేరు ఉత్తర్వులు జారీ చేశారు.

వెటర్నరీ లైవ్ స్టాక్ అధికారి డిప్యుటేషన్ పొడిగింపు

కడప జిల్లా లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ అసోసియేషన్‌లో వెటర్నరీ లైవ్ స్టాక్ అధికారిగా డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న డాక్టర్ ఎస్.పెంచలరాజుకు మరో ఏడాది డిప్యుటేషన్ పొడిగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జూలై 16 నుంచి 2025 జూలై 15వ తేదీ వరకూ ఈ డిప్యుటేషన్‌ను పొడిగించారు. కాగా కడప పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న డాక్టర్ జి.శ్రీనివాసులురెడ్డికి నెల రోజుల సెలవును ప్రభుత్వం మంజూరు చేసింది. వ్యక్తిగత పనుల మీద అమెరికా వెళ్లేందుకు అనుమతిస్తూ నవంబరు 23వ తేదీ నుంచి డిసెంబరు 24 వరకూ ఈ సెలవును మంజూరు చేసింది. ఈ రెండు ఉత్తర్వులను రాష్ట్ర పశు సంవర్ధక శాఖ కార్యదర్శి ఎం.ఎం.నాయక్ జారీ చేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.లక్ష విరాళం

పీలేరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): విజయవాడ వరద బాధితుల సహాయ నిధికి పీలేరులోని పారా మిలటరీ అసోసియేషన్ సభ్యులు రూ.లక్ష విరాళం అందజేశారు. విజయవాడలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో బుధవారం వారు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఈ మేరకు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు పీఎస్ ఖాన్, కార్యదర్శి పి.చంద్రశేఖర్, అడ్వైజర్ బీసీ రెడ్డప్ప, కోశాధికారి రమణబాబు, తదితరులు పాల్గొన్నారు.


విరాళం చెక్కును ముఖ్యమంత్రికి అందజేస్తున్న పీలేరు వాసులు

మిగిలిన ప్రభుత్వ మద్యం సీజ్

మదనపల్లెటౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె ఎక్సైజ్ పోలీసుస్టేషన్ పరిధిలోని ఇదివరకు నిర్వహించిన 22 ప్రభుత్వ మద్యం దుకాణాలకు ఎక్సైజ్ సీఐ భీమలింగ ఆధ్వర్యంలో సీజ్ చేశారు. బుధవారం మదనపల్లె, రామసముద్రం, నిమ్మనపల్లె, కురబలకోట, బి.కొత్తకోట మండలాల్లోని 22 ప్రభుత్వ మద్యం దుకాణాలను ప్రత్యేక బృందాలతో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రభుత్వ మద్యం దుకాణాల్లో మిగిలిన మద్యం స్టాకును రెవెన్యూ అధికారుల సమక్షంలో పంచనామా నిర్వహించి, సీజ్ చేశామన్నారు. ప్రభుత్వ ఆదేశాలు వచ్చిన వెంటనే ఈ మద్యాన్ని ఎక్సైజ్ డిపో అధికారులకు అప్పగిస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎక్సైజ్ ఎస్ఐలు జబీవుల్లా, డోర్కాస్, హెచ్‌సీ అలీ తదితరులు పాల్గొన్నారు.


మద్యం దుకాణాన్ని సీజ్ చేస్తున్న అధికారులు

అందరూ అప్రమత్తంగా ఉండాలి

● సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

నిమ్మనపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ తెలిపారు. బుధవారం ముష్టూరులోని బాహుదా ప్రాజెక్టును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ తుఫాన్ కారణంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు ఉండడంతో అధికారులు నిత్యం పర్యవేక్షణలో ఉండాలన్నారు. అలాగే బాహుదా ప్రాజెక్టుకు ఎన్ని గేట్లు ఉన్నాయి.. ప్రాజెక్టు సామర్థ్యం, పూర్తి స్థాయిలో నిండి ఎంత కాలమైంది.. అనే విషయాలను అధికారులను అడిగారు. అదే విధంగా వర్షాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు గ్రామాల్లో పర్యటించి పంటల నష్టం వివరాలను తెలుసుకోవాలన్నారు. అలాగే కుంటలు, చెరువుల వద్ద ప్రజలు వెళ్లకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ సురేంద్రరెడ్డి, డీఈ ప్రసాద్, తహసీల్దార్ ధనంజేయులు, ఏఈఈ శ్రీహరి రెడ్డి, ఆర్ఐ రాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


బాహుదా ప్రాజెక్టు వద్ద సబ్ కలెక్టర్

చెరువు కట్టల పటిష్టతపై దృష్టి పెట్టండి : ఎమ్మెల్యే

మదనపల్లెటౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణానికి పడమర వైపున ఎగువన వున్న మూడు చెరువుల పటిష్టతపై అధికారులు దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆదేశించారు. బుధవారం మండలంలోని చీకిలబైలు పంచాయతీ మేడిపల్లె చెరువు, కదిరమ్మచెరువు, వెంకటమ్మ చెరువులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1996 సంవత్సరంలో వరదలు వచ్చినప్పుడు మూడు చెరువులు తెగిపోయి వరద నీరంతా మదనపల్లె పట్టణం మీద పడి అనేకమంది మృతి చెందారని గుర్తుచేశారు. ప్రస్తుతం ఇలాంటి పరిస్థితులు పునరావృత్తం కాకుండా చెరువుకట్టల స్థితిపై ఇరిగేషన్ అధికారులు అధ్యయనం చేసి నివేదికలు ఇవ్వాలన్నారు. చెరువు కట్టలు బలహీనంగా ఉంటే ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కాగా కదిరమ్మ చెరువును, అక్కడ వున్న పరిస్థితులను సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ పరిశీలించారు. బుధవారం తహసీల్దార్ ఖాజాబీ, జల వనరులశాఖ అధికారులతో కలసి చెరువు కట్టను పరిశీలించారు. చెరువు కట్ట ఎక్కడైనా తెగిపోయే అవకాశం వుందా.. అలాంటివి జరగకుండా ముందస్తు చర్యలపైన ఇంజినీర్లతో చర్చించారు. ఈ కార్యక్రమంలో జల వనరులశాఖ ఈఈ సురేంద్రరెడ్డి, ఏఈ రాయలబాబు రాజేంద్రప్రసాద్, ఆర్ఐ రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.


కదిరమ్మచెరువు కట్టపై అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే

పీలేరుకు తప్పిన ఏనుగుల బెడద

● కల్లూరు ఘాటుకు తరలిన గుంపు ● ఫలించిన అటవీ శాఖ సిబ్బంది యత్నాలు

పీలేరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పీలేరును వణికించిన గజరాజుల బెడద తప్పింది. పీలేరు ఇందిరమ్మ కాలనీ వద్ద తిష్ట వేసిన 15 ఏనుగుల గుంపును అటవీ ప్రాంతంలోకి పంపేందుకు అటవీ సిబ్బంది చేసిన ప్రయత్నాలు ఫలించాయి. జనావాసాలకు దూరంగా చిత్తూరు-పీలేరు మార్గంలోని కల్లూరు ఘాటు సమీపంలో ఉన్న గంటావారిపల్లె అటవీ ప్రాంతంలోకి వాటిని మళ్లించగలిగారు. దీంతో ఇందిరమ్మ కాలనీతోపాటు పరిసర ప్రాంతాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అయితే వాటిని అటవీ ప్రాంతం వైపు మళ్లించే క్రమంలో అవి ప్రయాణించిన మార్గంలోని పంట పొలాలు పాక్షికంగా ధ్వంసమయ్యాయి. వరి, టమోటా, మామిడి, కొబ్బరి పంటలు దెబ్బతిన్నాయి. పీలేరు, మదనపల్లె సెక్షన్ల అటవీ సిబ్బంది బుధవారం ఆయా ప్రాంతాల్లో పర్యటించి పంట నష్టాన్ని పరిశీలించారు. తాము పరిశీలించిన వివరాలను అటు వ్యవసాయ, ఇటు ఉద్యాన శాఖాధికారులకు అందజేసి ఆయా రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకుంటున్నారు.

కుప్పం టు పులిచెర్ల, పులిచెర్ల టు పీలేరు

పీలేరుకు వచ్చిన ఏనుగుల మంద ఎక్కడిదని మంగళవారం పీలేరు ప్రాంతంలో పెద్దఎత్తున చర్చ జరిగింది. పీలేరుకు తలకోన, మంగళంపేట అటవీ ప్రాంతం సమీపంలో ఉండడంతో తలకోన నుంచి అవి వచ్చి ఉంటాయని చాలా మంది భావించారు. అయితే అవి తలకోనకు చెందినవి కావని, పలమనేరులోని కౌండిన్య అభయారణ్యం నుంచి చాలా కాలం క్రితం సోమలవైపు వచ్చిన గుంపులోనివేనని అటవీ సిబ్బంది బుధవారం నిర్ధారించారు. నాలుగు రోజులుగా పులిచెర్ల మండలం మంగళంపేట ప్రాంతంలోని అటవీ సిబ్బంది, రైతులు పెద్దఎత్తున బాణాసంచా పేల్చి వాటిని అడవిలోకి మళ్లించే ప్రయత్నాలు చేశారు.

అధిక మోతాదులో జరిగిన పేలుళ్ల, వర్షం కారణంగా అవి దారితప్పి పీలేరు ప్రాంతంలోకి ప్రవేశించినట్లు మదనపల్లె, పీలేరు సెక్షన్ల అటవీ సిబ్బంది నిర్ధారించారు. ఏనుగులు ప్రయాణించిన మార్గంలోని పీలేరు మండలంలోని కాకులారంపల్లె పంచాయతీ చిన్న గాండ్లపల్లె, పెద్దగాండ్లపల్లె, ఆవులవారిపల్లె, రామిరెడ్డిగారిపల్లె, పులిచెర్ల మండలంలోని కొన్ని గ్రామాల్లో వరి, టమోటా, మామిడి, కొబ్బరి పంటలకు నష్టం వాటిల్లింది. పంట నష్టం జరిగి ఉంటుందని అంచనా వేసిన మదనపల్లె సెక్షన్ ఫారెస్టు సిబ్బంది వేణుగోపాల్, గిరి, సుధాకర్, షాజహాన్, శోభారాణి, రామ్మోహన్, దీప, జ్యోతి బుధవారం వేకువజామునే ఆయా గ్రామాలకు చేరుకుని 13 మంది రైతులకు చెందిన పంటలకు నష్టం వాటిల్లినట్లు నిర్ధారించారు. మంగళవారం ఏనుగులు తిష్ట వేసిన మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు యల్లెల రెడ్డప్పరెడ్డి తోటకు కూడా భారీగా నష్టం వాటిల్లినట్లు అధికారులు తేల్చారు. ఏనుగుల దాడిలో మంగళవారం ఉదయం మరణించిన రైతు చిన్న రాజారెడ్డి అంత్యక్రియలు బుధవారం ఆయన స్వగ్రామం బందార్లవారిపల్లెలో జరిగాయి.


ఏనుగులు ధ్వంసం చేసిన టమోటా పంటను పరిశీలిస్తున్న ఫారెస్టు సిబ్బంది

‘పాల’సముద్రం

● దినాదినాభివృద్ధి చెందుతున్న పాల ఉత్పత్తి

● డ్వాక్రా మహిళలకు కల్పతరువు పాడి పరిశ్రమ

పాడి పరిశ్రమ ఆర్థిక ప్రగతికి చక్కని సోపానమని చెప్పవచ్చు. వ్యవసాయ రంగం ఒడిదుడుకుల కారణంగా చాలామంది రైతులు ఆర్థికంగా చితికిపోతున్నారు. ఇలాంటి తరుణంలో పశుపోషణ ద్వారా పాడి పరిశ్రమను ఏర్పాటు చేసుకుంటే ఆర్థిక ఇబ్బందులు తొలుగుతాయి. రామసముద్రం మండలంలో అత్యధికమంది ప్రజలు పశుపోషణపై ఆధారపడి జీవిస్తున్నారు. ఇక్కడ రోజూ దాదాపు 5 వేల లీటర్ల పాలను అమ్ముతున్నారు. దీంతో ఈ మండలాన్ని పాలసముద్రంగా పిలుచుకుంటున్నారు.



రామసముద్రం, అక్టోబరు 16: రామసముద్రం మండలంలో పాడి పరిశ్రమ దినదినాభివృద్ధి చెందుతోంది. మూడు సంవత్సరాలుగా వర్షాలు బాగా పడి భూగర్భజలాలు వృద్ధి చెందాయి. దీంతో రైతులు తమ బీడు భూములు సైతం సాగు చేసి పశుగ్రాసం పెంచి పాడి పరిశ్రమ వైపు మొగ్గు చూపుతున్నారు. గత కొంతకాలంగా పాల ధరలు రోజురోజుకు పెరుగుతుండడం, పశువులపై పెట్టిన పెట్టుబడి వ్యయం స్థిరంగా ఉండడం, రోజువారీ నిలకడమైన ఆదాయం వస్తుండడంతో రైతులు పశుపోషణపై మక్కువ చూపుతున్నారు. తమ వ్యవసాయ పొలంలోనే డెయిరీ ఫామ్ ఏర్పాటు చేసి పశుపోషణ చేస్తూ లాభాలను పొందుతున్నారు. రైతులు పశుపోషణను ఎన్నుకోవడానికి ప్రధాన కారణం పంటలపై పెట్టిన పెట్టుబడి నిలకడగా లేని ధరలతో నష్టాలను చవిచూడడం, పాల ధరలు రోజురోజుకు పెరుగుతుండడంతో రైతులు పశుపోషణపై ఆసక్తి చూపుతున్నారు. అంతేకాకుండా ఇతర పంటల మార్కెటింగ్ ఖర్చుతో పోలిస్తే పాల మార్కెటింగ్ ఖర్చులు చాలా తక్కువగా ఉండడం కూడా పశుపోషణకు మరో కారణంగా చెప్పవచ్చు. మండలంలో 13 వేల పశువులు ఉన్నట్లు అంచనా. వాటి ద్వారా రోజుకు సుమారుగా 50 వేల లీటర్ల పాలు ఉత్పత్తి అవుతున్నట్లు తెలుస్తోంది. మండల కేంద్రంలోనే దాదాపుగా రోజుకు 5 వేల లీటర్ల పాలు ఉత్పత్తి అవుతుండడంతో రామసముద్రంను పాలసముద్రంగా పలు డెయిరీల యజమానులు అభివర్ణిస్తున్నారు. మండల పరిధిలో తిరుమల డెయిరీ, అమూల్ డెయిరీకి సంబంధించిన పాల సేకరణ కేంద్రాలు ఉన్నాయి. ఇవి కాకుండా మదనపల్లె కేంద్రంగా ఉంటూ రామసముద్రం మండలంలోని వివిధ గ్రామాల్లో పాల సేకరణ చేస్తున్న డెయిరీలు ఉన్నాయి. వాటిలో సంగం, హెరిటేజ్, దొడ్ల, జెర్సి, శ్రీకృష్ణ, బాలాజి డెయిరీలు ఉన్నాయి. ఇవే కాకుండా మండల సరిహద్దులో ఉన్న కర్ణాటక రాష్ట్రంలోని కేఎంఎఫ్, మూమార్కు డెయిరీలు సైతం రామసముద్రం మండలంలోని పలు ప్రాంతాల్లో తమ పాల సేకరణ కేంద్రాలు ద్వారా పాలను సేకరిస్తున్నారు. దీంతో పాల సేకరణలో పోటీతత్వం పెరిగి పాలకు గిట్టుబాటు ధరలు లభిస్తున్నాయి. ప్రస్తుతం దాదాపు అన్ని పాల డెయిరీలు నాలుగు శాతం వెన్న, ఎనిమిది శాతం ఎస్ఎన్ఎఫ్ ఉన్న పాలకు రూ.34 నుంచి రూ.36 చెల్లిస్తున్నారు. రాబోయే రోజుల్లో ఇది మరింతగా పెరిగి అవకాశాలు ఉన్నట్లు పాల సంస్థ యజమానులు అంటున్నారు. పశుపోషణ లాభదాయకంగా ఉండడంతో ఉన్నత చదువులు చదివిన వారు ఉద్యోగం కోసం ఎదురుచూడక పశుపోషణతో లాభాలు గడిస్తున్నారు.


డెయిరీకి పాలు పోస్తున్న డ్వాక్రా మహిళలు

పశుపోషణ ఓ కల్పతరువు

పశుపోషణ కుటుంబం ఇంటిల్లిపాది చేస్తూ ఒక కుటీర పరిశ్రమగా ఉండడంతో పాల ఉత్పత్తిలో మహిళలది ప్రముఖ స్థానం అని చెప్పవచ్చు. ముఖ్యంగా డ్వాక్రా సంఘాల మహిళలు తమ పొదుపు సంఘాల ద్వారా ఆర్థిక రుణాలు పొంది వాటిని పశుపోషణపై వెచ్చించి ఆర్థికాభివృద్ధి చెందుతున్నారు. రుణాలు సకాలంలో చెల్లిస్తుండడంతో బ్యాంక్‌లు మహిళలకు మరింతగా రుణాలు అందించడానికి మొగ్గు చూపుతున్నారు. అంతేకాక జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పశుగ్రాసం పెంపకానికి ఆర్థిక చేదోడు అందుతుండడంతో పశుపోషణ సులువుగా ఉంది. పాలతో ప్రతిరోజూ నిలకడైన ఆదాయంతో కుటుంబ పోషణకు మహిళలు ఆసరాగా ఉన్నారు.


పొలంలో షెడ్ వేసి ఆవులను పెంచుతున్న దృశ్యం

లాభదాయకంగా ఉంది..



గత పదేళ్లుగా వ్యవసాయం చేస్తున్నాను. ఇందులో దానిమ్మ, కొత్తిమీర తదితర పంటలు సాగు చేసి సరైన గిట్టుబాటు ధరలు లేక లక్షల్లో నష్టం వాటిల్లింది. దీంతో వ్యవసాయం వదిలేసి ఆరునెలల ముందు రూ.10 లక్షలు ఖర్చుతో 6 ఆవులు, వాటికి షెడ్డు నిర్మించుకున్నాను. నాలుగు ఎకరాల్లో కొంత హైబ్రిడ్ పశుగ్రాసం మరికొంత మొక్కజొన్న పశుగ్రాసం సాగు చేశాను. ఇప్పుడు రోజుకు 60 లీటర్ల పాలు డెయిరీకి వేస్తున్నాను. దీని ద్వారా రోజుకు రూ.2 వేల ఆదాయం వస్తోంది. ఖర్చులు పోను రోజుకు రూ.1500 మిగులుతోంది. దీనికి తోడు పశు వ్యర్థాలు పొలాలకు ఎరువులుగా ఉపయోగపడుతోంది. అంతేకాకుండా పశువుల రొట్టతో పంటల దిగుబడి పెరిగింది.

-వెంకటేష్, రైతు.

వైవీయూ పీజీ కోర్సుల్లో నేరుగా ప్రవేశాలు

కడప (ఎడ్యుకేషన్), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వైవీయూలో ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకామ్, ఎంపీఈడీ కోర్సుల్లో ఈనెల 17 నుంచి 27వ తేదీ వరకు నేరుగా అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రవేశాల సంచాలకులు డాక్టర్ లక్ష్మీప్రసాద్ తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఒరిజనల్ సర్టిఫికెట్లు రెండుసెట్ల జిరాక్స్, నిర్ణీత ఫీజుతో యూనివర్శిటీలోని ఏపీజే అబ్దుకలాం ప్రాంగణలో ఉన్న ప్రవేశాల సంచాలకుల కార్యాలయంలో హాజరు కావాలని సూచించారు. ఏపీ పీజీ సెట్ 2024 ఎంట్రెన్స్ రాసి అర్హత సాధించిన అభ్యర్థులు మాత్రమే ప్రవేశాలకు అర్హులన్నారు. ఇతర వివరాలకు వైవీయూ వెబ్‌సైట్‌లో సంప్రదించాలన్నారు.

ఖాళీల వివరాలు : ఇంగ్లీషు 35, తెలుగు 39, ఉర్దూ 26, జర్నలిజం 33, హిస్టరీ 29, పొలిటికల్ సైన్స్ 26, ఎకనామిక్స్ 41, కామర్స్ 37, బయకెమిస్ట్రీ 21, బయోటెక్నాలజీ 5, మైక్రో బయాలజీ 5, జెనెటిక్స్ అండ్ జినోమిక్స్ 29, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ 31, బోటనీ 16, జువాలజీ 6, మ్యాథ్స్ 38, ఫిజిక్స్ 26, మెటీరియల్ సైన్స్ అండ్ నానో టెక్నాలజీ 34, కెమిస్ట్రీ 9, జువాలజీ 26, సైకాలజీ 24, ఫిజికల్ ఎడ్యుకేషన్ 38, ఫుడ్ టెక్నాలజీ 22, కంప్యూటరు సైన్స్ 13, కాంపటీషనల్ డేటా సైన్స్ 27 ఖాళీలు ఉన్నాయన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి : ఆర్డీఓ



నదిలో నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ

కమలాపురం రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వర్షాలు తగ్గేంత వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని.. లోతట్టు ప్రాంతీయులకు అవగాహన కల్పించాలని ఆర్డీఓ జాన్ ఎరివిన్ పాలపర్తి తెలిపారు. బుధవారం కమలాపురం తహసీల్దారు కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అధిక వర్షాలు కురుస్తున్నాయని.. రెవెన్యూ పరిధి అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రస్తుతం తుఫాను ప్రభావం ఎక్కువగా ఉందని, ఎలాంటి నష్టాలు రాకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి అధికారిపై ఉందన్నారు. పెన్నా, పాపాఘ్ని నదుల పరివాహక లోతట్టు గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. వీఆర్వోలు సమాచారం సేకరించి కంట్రోలు రూముకు తెలపాలన్నారు. అనంతరం పెన్నా, కుందూ నది సమీపంలో నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దారు శివరామిరెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఫుడ్ టెక్నాలజిస్ట్స్ పాత్ర కీలకం



ఆహార కల్తీలను ఎలా గుర్తించవచ్చో వివరిస్తున్న విద్యార్థులు

పులివెందుల రూరల్, అక్టోబరు 16: (ఆంధ్రజ్యోతి): సరైన పౌష్టిక ఆహారంపై అవగాహన కల్పించడం, ప్రాసెసింగ్ శాతం పెంచడం, ఫుడ్ వేస్టేజ్ అరికట్టడంలో ఫుడ్ టెక్నాలజిస్ట్స్ పాత్ర కీలకమని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.మాధవ వివరించారు. బుధవారం స్థానిక ఆహార విజ్ఞానశాస్త్ర, సాంకేతిక కళాశాలలో ప్రపంచ ఆహార దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భవిష్యత్తు అంతా ఫుడ్ ప్రాసెసింగ్ రంగానిదే అన్నారు. అనంతరం కళాశాల విద్యార్థులు ఆహార కల్తీని ఎలా సులభంగా గుర్తించవచ్చో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఎల్‌బీఐ సెంటర్‌లో ఉన్న చిరుధాన్యాలు, పండ్లు ప్రాసెసింగ్ కోసం ఏర్పాటు చేసిన యంత్రాలు ఉపయోగ వివరాలను వివరించారు. కార్యక్రమంలో కడప ఫుడ్‌సేఫ్టీ ఆఫీసర్ డాక్టర్ ఎం.హరిత, పులివెందుల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కిషోర్‌బాబు, పులివెందుల ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఆర్.నాగరాజు, అధ్యాపకులు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఇసుక రీచ్ ప్రారంభం



బెడుదూరు వద్ద ఇసుక రీచ్‌ను ప్రారంభిస్తున్న తహసీల్దార్

కొండాపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెడుదూరు గ్రామం సమీపంలో చిత్రావతి నదిలో ఇసుకరీచ్‌ను బుధవారం తహసీల్దార్ గురప్ప ప్రారంభించారు. ఈ సందర్భంగా రీచ్ వద్ద కూటమి నాయకులతో కలిసి పూజ కార్యక్రమాలను నిర్వహించారు. ఇప్పటికే మండలంలో ఏటూరు, పి.అనంతపురం గ్రామాల వద్ద ఇసుకరీచ్‌లు ఉండగా బెడుదూరు వద్ద మరో రీచ్‌ను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇసుక రవాణా ప్రారంభమవుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎన్డీయే కూటమి నాయకులు అరుణ్ కుమార్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, నాగిరెడ్డి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అరటిలో ఆకుమచ్చ తెగులు నివారణకు చర్యలు తీసుకోండి



మాట్లాడుతున్న ఉద్యానశాఖ అధికారి రాఘవేంద్రారెడ్డి

వేముల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు అరటి పంటలో సిగటోక ఆకుమచ్చ తెగులు ఉధృతి పెరిగే అవకాశం ఉందని.. నివారణకు చర్యలు తీసుకోవాలని ఉద్యానశాఖ అధికారి రాఘవేంద్రారెడ్డి రైతులకు సూచించారు. బుధవారం మబ్బుచింతలపల్లెలో మండల వ్యవసాయాధికారి చెన్నారెడ్డి అధ్యక్షతన పొలం పిలుస్తోందిలో ఆయన మాట్లాడుతూ గెల వేయని చెట్లకు ప్రొపికోనాజోల్ 2ఎంఎల్ లీటర్ నీటికి హార్టికల్చర్ మినరల్ ఆయిల్ 10ఎంఎల్ కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. గెల వేసిన చెట్లకు ప్రొపికోనాజోల్, డిఫెనాకానాజోల్ మందు మిశ్రమాన్ని పిచికారీ చేసుకోవాలని, మందు పిచికారీ చేసిన తర్వాత మాత్రమే తెగులు సోకిన ఆకులను కోసివేయాలని, భూమిలోని తేమను చూసుకుని తోటకు నీరు పెట్టాలని తెలిపారు. ప్రస్తుతం వర్షాల తర్వాత యూరియా, పొటాష్‌ను డ్రిప్‌లో పంపించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌కే అసిస్టెంట్ మోహన్‌కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

రహదారులు.. రక్తసిక్తం

- నిర్లక్ష్యం, అతివేగంతోనే ప్రమాదాలు
- ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనదారులు
- నిత్యం ఎక్కడో ఒకచోట ప్రమాదం
- గాలిలో కలిసిపోతున్న ప్రాణాలు
- ట్రాఫిక్ రూల్స్ పాటిస్తేనే.. ప్రమాదాలు తగ్గుముఖం



కడప (క్రైం), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నిర్లక్ష్యం, అతివేగంతో ప్రతి నిత్యం ఎక్కడో ఒక చోట ప్రమాదం సంభవిస్తూ నిండు ప్రాణాలు కోల్పోతున్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించక పోవడం.. మితిమీరిన వేగంతో వాహనాలు నడపడం... ముఖ్యంగా యువత హైస్పీడుతో బైకులు నడుపుతుండ టంతో వారితో పాటు ఇతరులు ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుంది. దీంతో రోడ్డు ప్రమాదాల్లో పిల్లలను కోల్పోయిన తల్లిదండ్రులు కడుపుకోత అనుభవించాల్సి వస్తోంది. అలాగే కుటుంబ పెద్దలను కోల్పోయిన పిల్లలు అనాథల్లా మారిపోతున్నారు. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని వాహ నాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటిస్తే ప్రమాదాల తీవ్రత తగ్గుతుందని అధికారులు చెబుతున్నారు.

చిన్నపాటి నిర్లక్ష్యానికి నిండు ప్రాణాలు బలి అవుతున్నాయి. తప్పు ఎవరిదైనా వాహనాలు నడిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు పాటించకపోతే మనతో పాటు ఇతరులు ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుంది. ప్రస్తుతం ఉన్న వాహనాలు హైస్పీడ్ కలిగి ఉండటం.. నిర్లక్ష్యం, అతివేగం, జాగ్రత్తలు పాటించక పోవడంతో ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు. ఇటీవల జిల్లాలో తరచూ ఎక్కడో ఒకచోట ప్రమాదాలు సంభవిస్తూ.. కుటుంబ సభ్యులు కడుపుకోత అనుభవించాల్సి వస్తోంది. ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించినప్పుడే ప్రమాదాల తీవ్రత తగ్గుతుంది. 50 స్పీడ్‌లో వెళ్లాల్సిన వారు 100, 120 స్పీడ్‌లో పోతే ఏ మాత్రం అదుపు తప్పినా ప్రాణాలు గాల్లోనే కలిసిపోక తప్పదు. వాహనదారుడు నిర్లక్ష్యం, ఓవర్ టేకింగ్, మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు రోడ్డు రవాణా శాఖా అధికారులు అవగాహన కలిగిస్తున్నప్పటికీ కొందరిలో మార్పు కనిపించడంలేదు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతూ ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు. అధికారులు మాత్రం ట్రాఫిక్ రూల్స్ తప్పనిసరిగా పాటిస్తేనే... ప్రమాదాలను నిరోధించే అవకాశం ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు.

వాహనదారులు జాగ్రత్తలు పాటించాలి



ప్రతి వాహనదారుడు వాహనం నడిపేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు అతివేగం, ఓవర్‌టేక్, మద్యం సేవించి డ్రైవింగ్ చేసేటప్పుడే ప్రమాదాలు సంభవిస్తాయి. ప్రమాదాలు జరిగినప్పుడు వారు ప్రమాదాలు కొని తెచ్చుకోవడమే కాక ఎదుటి వారి ప్రాణాలు కూడా తీసేందుకు కారణమవుతున్నారు. కావున ప్రతి డ్రైవరు జాగ్రత్తగా డ్రైవింగ్ చేస్తూ వారి గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకోవాలి. నగర శివార్లలో వాహనదారులకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పిస్తున్నాం.

-జావీద్, కడప ట్రాఫిక్ సీఐ

రోడ్డు ప్రమాదాలను గమనిస్తే...

- ఆగస్టు 26న అన్నమయ్య జిల్లా కడప జిల్లా బార్డర్ అయిన గువ్వల చెరువు ఘాట్ వద్ద కారును లారీ ఢీ కొన్న సంఘటనలో ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందారు.
- జూన్ 17న కడప నగరం రాజంపేట రోడ్డులోని గురుకుల బాలికల పాఠశాల వద్ద ఆర్టీసీ బస్సు, కారు ఢీకొన్న సంఘటనలో ముగ్గురు ప్రాణాలు విడిచారు.
- జూన్ 16న ఆర్టీసీ అద్దె బస్సు అలంఖాన్‌పల్లె సర్కిల్ సమీపంలోని పాత టోల్‌గేటు వద్ద ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ముగ్గురు యువకులు దుర్మరణం చెందారు.
- మార్చి 25న ఒంటిమిట్ట ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు స్పాట్ డెడ్.
- మే 15న కొండాపురం వద్ద లారీ, తుఫాను వాహనాన్ని ఢీకొట్టడంతో ఏడుగురి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. ఇటీవల సిద్దవటం పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు మహిళలు దుర్మరణం చెందారు. ఉమ్మడి జిల్లాలో ఇలాంటి ప్రమాదాలు రోజూ ఎక్కడో చోట జరుగుతూనే ఉన్నాయి. దీనికంతటికీ వాహనదారుల నిర్లక్ష్యం, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపమే ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి.

గండికోటకు మళ్లీ కృష్ణాజలాలు

- 4వేల క్యూసెక్కులు చేరిక
- వరదనీరు 2వేల క్యూసెక్కులు
- మైలవరం జలాశయానికి నీరు విడుదల



గండికోట నుంచి మైలవరం జలాశయానికి నీరు విడుదలవుతున్న దృశ్యం

కొండాపురం / మైలవరం అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అవుకు రిజర్వాయిర్ నుంచి బుధవారం గండికోట ప్రాజెక్టుకు 4 వేల క్యూసె క్కుల కృష్ణాజలాలు వస్తున్నట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. అదేవిధంగా రెండురోజులగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకల ద్వారా ప్రాజెక్టులోకి మరో 2వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరింద న్నారు. ఇప్పటికే ప్రాజెక్టులో తగినంత నీటిమట్టం ఉండటంతో గేట్లు ఎత్తి మైలవరం జలాశయానికి 7500 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నామన్నారు. కాగా ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 26.2 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అయన వివరించారు.

పెన్నాకు కొనసాగుతున్న నీటి విడుదల



మైలవరం జలాశయం నుంచి పెన్నాకు నీరు విడుదల చేస్తున్న దృశ్యం

మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి 8 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు జలాశయ డీఈఈ నరసింహామూర్తి తెలిపారు. గండికోట జలాశయం నుంచి నీరు వచ్చి మైలవరంలో చేరుతుండటంతో బుధవారం పెన్నాకు 8వేల క్యూసెక్కులు, ఉత్తర కాలువకు 30 క్యూసెక్కులు, దక్షిణ కాలువకు 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని తెలిపారు. వర్షాల కారణంగా మైలవ రానికి ఇన్‌ఫ్లో పెరిగితే మరింత నీటిని పెన్నానదికి వదిలే అవకాశం ఉందని.. పెన్నా పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మైలవరం జలాశయం పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 6.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం 6 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు.

ఉరి వేసుకుని మహిళ మృతి



సికెదిన్నె, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకుని నూకలబోయిన నాగలక్ష్మి (38) మృతి చెందినట్లు చింతకొమ్మదిన్నె సీఐ చంద్రశేఖర్‌నాయక్ తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం జమాల్‌పల్లెకు చెందిన నాగలక్ష్మి భర్త రవిచంద్ర ఏడేళ్ల కిందట మరణించాడని, ఒంటరితనం భరించలేక శ్వాస సంబంధిత వ్యాధితో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని చనిపోయినట్లు తెలిపారు. వీరికి ఇద్దరు పిల్లలున్నారని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీ.. వ్యక్తి మృతి



ఖాజీపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అంజనేయకొట్టాలుకు సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని చంద్రశేఖర్‌రెడ్డి (60) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. అంజనేయకొట్టాలుకు చెందిన చంద్రశేఖర్ రెడ్డి పని నిమిత్తం వచ్చి తిరిగి ఇంటికి వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో కాలు విరగడంతోపాటు తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 ద్వారా కడప రిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మోహన్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జమ్మలమడుగు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణ శివార్లలో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో సున్నపురాళ్ల గ్రామానికి చెందిన పూజారి రాజేష్ (28) తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే అతన్ని అదే రోజు జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రి నుంచి మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించారు. తిరుపతిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతదేహాన్ని జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి బుధవారం తరలించి పోస్టుమార్టం నిర్వహించి.. కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

దాడి చేసిన నలుగురిపై కేసు నమోదు

మదనపల్లె అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బాకీ విషయమై దాడికి పాల్పడిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ చాంద్‌బాషా తెలిపారు. పోలీసుల సమాచారం మేరకు...

మదనపల్లె మండలం చిప్పిలి గ్రామం భువనేశ్వరీనగర్‌కు చెందిన జగదీష్ (27) దేవీవరప్రసాద్ వద్ద తన ద్విచక్రవాహనం కుదవ పెట్టి ఎనిమిది నెలల క్రితం రూ.40వేలు అప్పుతీసుకున్నారు. ఎన్నిసార్లు అడిగినా చెల్లించకపోవడంతో బుధవారం రాత్రి జగదీష్ మల్లికార్జున సర్కిల్‌లో ఉన్నాడని తెలుసుకుని దేవీవరప్రసాద్ తన మిత్రులు సురేష్, వెంకీ, భాస్కర్‌తో కలిసి దాడి చేసి కొట్టారు. ఈ మేరకు వన్‌టౌన్ సీఐ ఆ నలుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య



రామసముద్రం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తాగుడుకు బానిసై కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. రామసముద్రం మండలం భూసాని కురపల్లెకు చెందిన బుత్తన్నగారి శంకర(50) గత కొన్నేళ్లుగా తాగుడుకు బానిసై తరచూ కుటుంబ సభ్యులతో గొడవ పడేవాడు. ఈ నేపథ్యంలో గురువారం యథావిధిగా కుటుంబ సభ్యులతో గొడవపడి మనస్తాపం చెంది సీతరగానిపల్లె సమీపంలో పొలంలోని చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని శవపరీక్షల నిమిత్తం పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు.

కోడిపందెం రాయుళ్లు అరెస్టు

మదనపల్లె అర్బన్, అక్టోరు16: (ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణం, వీవర్స్ కాలనీ సమీపంలో కోడిపందెం ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపారు. బుధవారం స్థానిక వీవర్స్ కాలనీ సమీపంలో కోడి పందెం ఆడుతున్నట్లు సమాచారం రావడంతో టూటౌన్ ఎస్ఐ రవికుమార్, సిబ్బందితో అక్కడికి వెళ్లి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రెండు నాటు కోళ్లు, రూ.3020 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కారు ఢీ.. దంపతులకు తీవ్రగాయాలు

మదనపల్లె అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కారు బైకును ఢీకొన్న సంఘటనలో దంపతులు తీవ్రంగా గాయపడినట్లు మదనపల్లె వన్‌టౌన్ సీఐ చాంద్‌బాషా తెలిపారు. వివరాల మేరకు... మండలంలోని కోళ్లబైలు గ్రామపంచాయతీ, జగన్‌కాలనీకి చెందిన దంపతులు వెంకటరమణ (48), మేనక (42) ద్విచక్రవాహనంపై మదనపల్లె పట్టణానికి వచ్చారు. పనులు చూసుకుని తిరిగి ఇంటికి తిరుగు ప్రయాణంలో అమ్మచెరువు మిట్ట గంగమ్మగుడి వద్దకు రాగానే బైకును మదనపల్లెకు వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన దంపతులను జిల్లా ప్రభుత్వాస్పత్రికి చికిత్స కోసం స్థానికులు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆర్టీసీకి దసరా ఆదాయం రూ.59లక్షలు

కడప మారుతీనగర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ పురస్కరించుకుని వివిధ ప్రాంతాల నుంచి జిల్లాకు వచ్చిన ప్రయాణికుల ద్వారా రూ.59,38,002 ఆదాయం వచ్చిందని ఆర్టీసీ కడప రీజనల్ మేనేజరు పి.గోపాల్‌రెడ్డి తెలిపారు. ఈనెల 8వతేదీ నుంచి 11వ తేదీ వరకు సుమారు 283 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసి విజయవాడ, బెంగ ళూరు, హైదరాబాదు, చెన్నై, తిరుపతి, కర్నూలు తదితర ప్రాంతాల నుంచి జిల్లాకు ప్రయాణికులను రప్పించామన్నారు. దీంతో ఆయా బస్సుల ద్వారా ఈ ఆదాయం సమకూరిందన్నారు.

మందు రేట్లు తగ్గలే..!

మందుబాబుల అసంతృప్తి

పోరుమామిళ్ల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మద్యం ధరలు తగ్గిస్తామని చెప్పిన మాటలు హామీలకే పరిమితమయ్యాయి. బుధవారం జిల్లావ్యాప్తంగా పలుచోట్ల మద్యం దుకాణాలు ప్రారంభం అయ్యాయి. అయితే ఎక్కడా ప్రభుత్వం ప్రకటించిన మేరకు రూ.99కే మద్యం ఇవ్వలేదు. అన్నీ పాత ధరలకే అమ్మారు. చెప్పిందొకటి చేసేదొకటి అన్న రీతిలో మద్యం ప్రియులు విమర్శలు గుప్పించారు. పోరుమామిళ్లలో కొత్తగా నాలుగు మద్యం షాపులు మంజూరు కావడంతో ప్రభుత్వ దుకాణాలకు సీల్ వేశారు. దీంతో మధ్యాహ్నం 3గంటల వరకు మద్యం అందుబాటులోకి రాకపోవడంతో మందుబాబులు మద్యం కోసం షాపుల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చింది. మరికొందరు బ్లాక్‌లో అమ్మేవారి నుంచి కొనుగోలు చేశారు. సాయంత్రం అయ్యేసరికి మందుబాబులంతా మద్యంషాపుల వద్ద గుమికూడారు. ఎక్సైజ్ అధికారులు ఎమ్మార్పీ ధరల పట్టిక ఏర్పాటు చేయలేదు. గోడౌన్ నుంచి పూర్తిస్థాయిలో మద్యం సరఫరా కాకపోవడంతో షాపులు దక్కించుకున్న వారు అధికారుల ఆదేశాలు వచ్చేంత వరకు పాత ధరలనే కొనసాగించనున్నారు. రూ.99కే మద్యం అందకపోవడంతో మద్యంప్రియుల నుంచి అనేక విమర్శలు వెల్లువెత్తాయి.

సామాజిక తనిఖీలో అవకతవకలు

- ఫీల్డ్‌అసిస్టెంట్ల చేతివాటంపై డ్వామా ఏపీడీ ఆగ్రహం



సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

చెన్నూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): చెన్నూరులో మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం నిర్వహించిన సామాజిక తనిఖీలో అవకతవ కలు బయటపడ్డాయి ఉప్పరపల్లె, ముండ్లపల్లె, రాచిన్నాయల్లెకు సంబం ధించి రూ.12వేలు అవకతవకలు జరిగి నట్లు బయపటడింది. సమావేశంలో డ్వామా ఏపీడీ నాగరత్నమ్మ జరిగిన అవకతవకలపై మండిపడ్డారు. ఫీల్డ్ అసిస్టెంట్లు చేతివాటం ప్రదర్శించారని.. అందులో మస్టర్లలో కొట్టివేతలు, పనులు చేయకపోయినా ఉపాధి కూలీ ఇవ్వ డంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో మాట్లాడుతూ 1.4.2023 నుంచి 31.3.2024 వరకు మండల వ్యాప్తంగా 932 పనులు జరిగాయని, 7.34 లక్షల ఖర్చు చేశారన్నారు. దీనిపై నిర్వహించిన సామాజిక తనిఖీలో రూ.12వేలు రికవరీ చేశారు. మస్టర్లలో జరిగిన అవకతవకలకు ఫీల్డ్ అసిస్టెంట్లు బాధ్యులని తనిఖీ బృందం వివరించారు. దీంతో సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ సురేశ్‌బాబు, ఏపీఓ శైలజ, ఎంపీపీ చీర్ల సురేశ్‌యాదవ్, టీడీపీ నేతలు కిరణ్ మోహనరావు, కె.విజయభాస్కర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

కోదండరాముడి సన్నిధిలో జగన్‌మోహన్‌రాజు



కోదండరాముడిని దర్శించుకున్న జగన్‌మోహన్‌రాజు

ఒంటిమిట్ట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కోదండరామాలయంలో స్వామివారిని బుధవారం రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్ రాజు దర్శించుకున్నారు. టీటీడీ అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం మూలవిరాట్‌కు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు కొమరా వెంకట నరసయ్య, బాకరాపేట సర్పంచ్ ప్రతాప్, శ్రీనివాసులునాయుడు, శివారెడ్డి, హరినాథ్ రెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు నందలూరు మండల సర్వసభ్య సమావేశం

నందలూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సుజాతమ్మ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆమె మాట్లాడుతూ ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సమావేశానికి రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథ్ రెడ్డి, ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిలు హాజరవుతున్నారని తెలిపారు. జడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, కోఆప్షన్‌సభ్యులు, గ్రామ సర్పంచ్‌లు, మండల ఉన్నతాధికారులు, ఇతర సిబ్బంది సమావేశానికి తప్పక హాజరు కావాలని ఆమె కోరారు.

పోలీసు లాంఛనాలతో కానిస్టేబుల్ అంత్యక్రియలు



కానిస్టేబుల్‌కు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్న పోలీసులు

రాయచోటిటౌన్, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న లక్కిరెడ్డిపల్లె పోలీసుస్టేషన్ కానిస్టేబుల్ కొండూరు సతీశ్‌రాజు చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్ ఆదేశాల మేరకు సీఐ వరప్రసాద్ తన సిబ్బందితో కలిసి సతీశ్‌రాజు స్వగ్రామమైన వైకుంఠరాచపల్లెలో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. పోలీసుశాఖ తరపున బాధిత కుటుంబానికి సానుభూతిని తెలియ జేశారు.

మహిళను మోసం చేసిన కేసులో ఒకరి అరెస్టు

రైల్వేకోడూరు(రూరల్) అక్టోబరు 16, (ఆంధ్రజ్యోతి): ప్రేమిస్తున్నాని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఓ మహిళను మోసం చేసిన కేసులో గాలివీడు మండలానికి చెందిన జె.హేమసుందర్ రెడ్డిని బుధవారం అరెస్టు చేసినట్లు రైల్వేకోడూరు సీఐ హేమసుందర్ తెలిపారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేసి కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు తెలి పారు. రైల్వేకోడూరు మేజిస్ట్రేట్ నిందితుడికి రిమాండ్ విధించినట్లు సిఐ వివరించారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

రామాపురం, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న నాలుగు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెంకట సుధాకర్ రెడ్డి తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు బుధవారం కడప- రాయచోటి రోడ్డులోని మేదరపల్లి చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా ఎర్రచందనం రవాణా చేస్తున్న కారు పట్టుబడిందన్నారు. కారుతోపాటు నాలుగు దుంగలను స్వాధీనం చేసుకుని, షేక్ జిలానీబాషా అనే వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. ఎర్రచందనం దుంగల విలువ సుమారు 2 లక్షలు ఉంటుందని తెలియజేశారు.

ఎర్రబల్లెలో సమస్యల సంత!

● ఎగుడుదిగుడు రోడ్లు ● పారని మురుగు ● రోడ్లపైనే వర్షపు నీరు





అసంపూర్తిగా ఉన్న మురుగు కాలువ, వర్షాకాలంలో వరదనీటితో నిండిపోతున్న ఎర్రబల్లె ప్రాంతం

రాజంపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలోని ఎర్రబల్లె ప్రాంతంలో సమస్యలు రాజ్యమేలుతున్నా యి. ఆర్టీసీ బస్టాండ్, హైవే మధ్యలో ఉన్న ఈ ప్రాంతంలో సుమారు రెండు వేల గృహాలు ఉన్నా యి. అందులో వెయ్యి గృహాలు ఐదేళ్ల క్రితం నిర్మిం చినవే. ఈ ప్రాంతంలో గత ప్రభుత్వ హయాంలో మురుగు కాలువ నిర్మించినా, దానిని ప్రధాన కాలు వకు అనుసంధానం చేయక పోవడంతో మురుగు నీరు ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. ఈ విషయంపై మునిసిపాలిటీ అధికారులకు ఎన్ని విజ్ఞప్తులు చేసినా, వారు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నా రన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ కాలువపై మూతలు లేకపోవడంతో వాహనదారులు అందులో పడి గాయాలపాలవుతున్నారు. రోడ్డు సైతం ఎగుడు దిగుడుగా, అస్తవ్యస్తంగా ఉండడం, మోకాటి లోతు వర్షపునీరు నిలు స్తుండడంతో వాహన దారులు ఇబ్బందులు పడుతున్నారు. పద్మ ప్రియ కల్యాణ మండపం సమీపం లో వర్షాకాలంలో సుమారు 4 అడు గుల లోతు నీరు నిలుస్తుండడంతో సుమారు నెలరోజుల పాటు ఈ ప్రాంతానికి రాకపోక లు నిలిచిపోతున్నాయి. వర్షాకాలంలో వరదనీరు బయటకు పోయే వీలు లేకపోవడంతో దోమలు పెరిగిపోయి ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ ప్రాంతంలో సిమెంటు రోడ్లు, మురుగు కాలువలు ఏర్పాటు చేయా లని స్థానికులు కోరుతున్నారు.

గ్రామీణాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



రామక్కపల్లెలో సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్



అనంతపురం ఈడిగపల్లెలో సీసీ రోడ్డుకు భూమి పూజ చేస్తున్న లక్ష్మీప్రసాద్ రెడ్డి

లక్కిరెడ్డిపల్లె అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామీణాభివృద్ధి ప్రభుత్వ ధ్యేయమని మండిపల్లె లక్ష్మీప్రసాద్‌రెడ్డి తెలిపారు. పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని దిన్నెపాడు, పర్వతరెడ్డిగారిపల్లె, చింతకుంటపల్లె, అనంతపురం గ్రామాల్లో సిమెంటు రోడ్ల పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్కిరెడ్డిపల్లె మండలంలో 1.40 కోట్ల రూపాయలతో సీసీ రోడ్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే మండలంలో 40 బోర్లు వేసి తాగునీరు అందించామని, నీళ్ల పడని గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా అందిస్తున్నామన్నారు. త్వరలో 100 బోర్లు వేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు యనమల మదన్‌మోహన్ ఎంపీడీఓ రెడ్డెయ్య, తహసీల్దార్ లక్ష్మీప్రసన్న, ఈవోపీఆర్డీ ఉషారాణి, ఏపీఓ పెంచలయ్య, మండల ఇంజనీర్ సుబ్రమణ్యం, రాజంపేట పార్లమెంట్ ఆర్ఎంపి డాక్టర్ల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ షఫీనాయక్, మాజీ సర్పంచు శ్రీనివాసులు, రామకృష్ణ, మోహన్ రెడ్డి, ధర్మరాజు, చలపతి, వేణు, శ్రీనివాసులు, బుడ్డాన్ సాహెబ్, అహ్మద్, శ్రీనివాసులు, రామచెన్నారెడ్డి, శ్రీకాంత్‌రాజు, అచ్చిరాజు, విజయమోహన్ పాల్గొన్నారు.

రామాపురం: మండలంలోని నల్లగుట్టపల్లి, రాచపల్లి, సరస్వతిపల్లెల్లో బుధవారం సీసీ రోడ్ల నిర్మాణానికి లక్ష్మీప్రసాద్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రారంభించిన పనులన్నింటినీ సంక్రాంతి నాటికి పూర్తి చేసేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ రమేశ్‌రెడ్డి, ఎంపీ డీవో జాషువా, ఈవోపీఆర్డీ పట్నాయక్, పీఆర్‌జేఈ జగదీశ్, ఈసీ శివయ్య, టీఏలు నాగభూషణం, సర్పంచ్ మునీర్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రవికుమార్ రెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

సీసీ రోడ్లకు ఎమ్మెల్యే భూమిపూజ

పుల్లంపేట: మండల పరిధిలోని అప్పయ్యరాజుపేట పంచాయతి రామక్కపల్లె, వంటిల్లు అరుంధతివాడలో బుధవారం ఎమ్మెల్యే అరవ శ్రీధర్ సిమెంట్ రోడ్లకు భూమిపూజ చేశారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి, మండల ఇన్‌చార్జి ఆరె సుధాకర్‌నాయుడు, ఉపాధ్యక్షుడు కాపెర్ల చంద్రశేఖర్ నాయుడు, యూనిట్‌ఇన్‌చార్జి చుండు ఈశ్వర్‌నాయుడు, మాజీ జిల్లా కార్యదర్శి కావేటి వెంకటసుబ్బయ్య యాదవ్, గణపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

వెలిగల్లు జలాశయం పరిశీలన



జలాశయాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

గాలివీడు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలిగల్లు జలాశయాన్ని బుధవారం తహసీల్దార్ భాగ్యలత పరిశీలించారు. ప్రాజెక్టు సామర్థ్యం ప్రస్తుతం నీటిమట్టం వివరాలను ఆరా తీశారు. వెలిగల్లు జలాశయం సామర్థ్యం 4.64 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 2.369 టీఎంసీల నీరు చేరిందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. 50 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉందని వివరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ కుషావతి, వెలిగల్లు ప్రాజెక్టులతో పాటు చెరు వులు, కుంటలు వరద ముంపు ప్రాంతాలపై నిఘా ఉంచడంతోపాటు, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అధికారులను అప్రమత్తం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెలిగల్లు ప్రాజెక్టు డీఈ, ఆర్ఐ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల్లో అధికారుల పర్యటన



చెయ్యేటి పరివాహక ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మండల అధికారులు

పెనగలూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసేందుకు బుధవారం తహసీల్దారు సీహెచ్ ఇంద్రాణి, ఎంపీడీవో విజయరావు తమ సిబ్బందితో సిద్దవరం, నరసింగరాజుపురం, సింగనమల ప్రాంతాలను పరిశీలించారు. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నందున ఏ సమయంలోనైనా వరదలు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని సూచించారు. అత్యవసరమైనప్పుడు తమకు సమాచారం ఇస్తే తగిన సహాయ సహకారాలు అందిస్తామని ఈ సందర్భంగా ఆయ గ్రామ ప్రజలకు సూచించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎంపీడీవో



పూడికలు తీయిస్తున్న ఎంపీడీవో మలిరెడ్డి

ఓబులవారిపల్లె, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : వర్షాల కారణంగా ఎలాంటి ప్రమాదాలు సంభవించకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులు, స్థానిక నాయకులపై ఉందని ఎంపీడీవో మలిరెడ్డి సూచించారు. వర్షాల వల్ల ఏదైనా ఇబ్బందులు తలెత్తితే స్థానిక ప్రజాప్రతినిధులకు, ప్రభుత్వ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. రైల్వేస్టేషన్ సమీపంలోని అండర్‌బ్రిడ్జిలో నీరు చేరడంతో ప్రమాద సూచికలు ఏర్పాటు చేయించారు. మండల కేంద్రంలోని ప్రధాన వీధుల్లోని కాలువల్లో పూడిక తీయించారు. ఈ కార్యక్రమంలో పంచాయతి కార్యదర్శి భారతి, సర్పంచ్ జయపాల్‌రెడ్డి, ఈవోపీఆర్డీ డి.రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరద ప్రాంతాలను పరిశీలించిన డీఎస్పీ

రైల్వేకోడూరు, అక్టోబరు 16:(ఆంధ్రజ్యోతి): మండలంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో రాజంపేట డీఎస్పీ నాంపల్లె సుధాకర్ బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద కారణంగా ఎలాంటి దుర్ఘటనలు జరుగకుండా నదులు, వాగుల వద్ద సిబ్బంది కాపలా ఉన్నారని తెలిపారు. రాత్రి వరద ఉధృతి ఎక్కువైతే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట రైల్వేకోడూరు సీఐలు హేమసుందర్‌రావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో స్తంభించిన జనజీవనం



పంటకాలువలో పూడిక తొలగిస్తున్న సచివాలయ కార్మికులు

పుల్లంపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలో బుధవారం తెల్లవారుజాము నుంచి ఒకటిన్నర గంట పాటు భారీ వర్షం కురిసింది. దీంతో రెండు గంటలకు పైగా విద్యుత్ ప్రసారం నిలిచిపోయింది. మండల కేంద్రంలో పంట కాలువ నీరు రోడ్డుపైకి చేరడంతో ఈవోఆర్డీ పెంచలయ్య ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పంట కాలువలోని చెత్తా చెదారాన్ని తొలగించారు. ఇంత వర్షం పడుతున్నా పుల్లంగేరుకు నీరు రాకపోవడంపై మండల ప్రజలు నిరాశ వ్యక్తం చేస్తున్నారు.

వర్షాల నేపథ్యంలో ముందస్తు చర్యలు



పనులు పరిశీలిస్తున్న అధికారులు

చిన్నమండెం, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఎంపీడీవో దివ్య, మల్లూరు సర్పంచ్ దేవపట్ల నజీర్‌బాషా చాకిబండ రోడ్డు మల్లూరు కస్పాకి అనుసంధానంగా నదిపై ఉన్న బ్రిడ్జి దగ్గర అడ్డంగా ఉన్న పెద్ద పెద్ద బండరాళ్లు, ముళ్లకంపలు, చెట్లను జేసీబీ సాయంతో తొలగించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ హర్షవర్ధన్‌రెడ్డి, పంచాయతీ సెక్రటరీ గౌస్‌పీర్, ఇంజనీర్ అసిస్టెంట్ రాజ్‌కుమార్, శివకుమార్‌నాయక్, వెల్ఫేర్ అసిస్టెంట్ రాజ్‌కుమార్, శివకుమార్ నాయక్, వెల్ఫేర్ అసిస్టెంట్ రాంమోహన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉద్యాన రైతులు సూచనలు పాటించండి

చిట్వేలి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : అధిక వర్షాల వల్ల ఉద్యాన పంటలకు నష్టం జరగకుండా తీసుకోవాల్సిన చర్యలను ఉద్యాన అధికారి ఆషియా వివరించారు. బుధవారం మండల పరిధిలోని కొత్తపల్లెలో ఆమెతోపాటు వ్యవసాయాధికారి సందీప్ పసుపు పంటను పరిశీలించారు. పసుపు పంటలో మురుగునీరు బయటకు పంపాలని, వారం వ్యవధిలో రెండు మూడు సార్లు 0.5 పొటాషియం నైట్రేట్ ద్రావణాన్ని పిచికారీ చేయాలని రైతులకు సూచనలు ఇచ్చారు. సూక్ష్మ పోషకాల మిశ్రమాన్ని 5 గ్రాములు లీటరు నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలన్నారు. పొలంలో నిలిచిన అదనపు నీటిని తీసివేసి నేల ఆరిన తర్వాత మొక్కలు బాగా పెరగడానికి ఎకరాకు 50 కిలోల యూరియా, 40 కిలోల ఎంఓపీ, 250 కిలోల వేపపిండి వేసుకోవాలని సూచించారు. బొప్పాయి, అరటి, మామిడి, కూరగాయల తోటల్లో సస్యరక్షణ చర్యలను వివరించారు.

సాంకేతిక లోపం.. సేవలకు దూరం



మూతపడిన సంబేపల్లె ఎస్‌బీఐ ఏటీఎం

సంబేపల్లె, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): నెలల తరబడి ఏటీఎం పని చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. సంబేపల్లె మండల కేంద్రంలో ఎస్‌బీఐ ఏర్పాటు చేసిన సాంకేతిక లోపం కారణంగా 9 నెలలుగా పనిచేయడం లేదు. దీంతో ఖాతాదారులు నగదు కోసం బ్యాంకుకు వెళ్లక తప్పడం లేదు. స్థానిక బ్యాంకు ఉద్యోగులు ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేసినా, సాంకేతిక లోపాలను సవరించకపోవడంతో సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఏటీఎం పని చేసేల చూడాల్సిన బాధ్యత అధికారులపై ఎంతైనా ఉంది.

'వైసీపీ నేతలకు విమర్శించే అర్హత లేదు'

రాయచోటిటౌన్, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): గడిచిన ఐదేళ్లలో ఇసుక, మట్టి, మద్యం, గంజాయి మాఫియాతో వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అల్లకల్లోలం చేయడమే కాకుండా ప్రజలకు రక్షణ లేకుండా చేసిందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా ఆరోపించారు. బుధవారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం అధికారం కోల్పోయి మతిభ్రమించిన వైసీపీ నేతలు ప్రజల్లో ఉనికిని చాటుకునేందుకు కూటమి ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఇసుక, మట్టిని అడ్డదారుల్లో తరలించి కోట్లు గడించిన వైసీపీ నేతలు ఉచిత ఇసుక విధానంపై ఆరోపణలు చేయడం సిగ్గుమాలిన చర్య అన్నారు. వైసీపీ బ్రాండ్లతో ప్రజల జీవితాలతో చెలగాటం ఆడిన నేతలకు కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న మద్యం పాలసీపై మాట్లాడే అర్హత వైసీపీ నేతలకు లేదన్నారు. అనవసరమైన ఆరోపణలు మానుకని ప్రభుత్వం చేపట్టే సంక్షేమ, అబివృద్ధి కార్యక్రమాల అమలుకు సహకరించాలని హితవు పలికారు. ఈ సమావేశలో లక్కిరెడ్డిపల్లె మండల నాయకుడు మదన్, జయరాంరెడ్డి, మురళి, నందకిశోర్, శివారెడ్డి, రఫీ తదితరులు పాల్గన్నారు.

చెక్ బౌన్స్ కేసులో నిందితుడికి రిమాండ్

పెనగలూరు, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) : చెక్ బౌన్స్ కేసులో కోర్టు వాయిదాలకు హాజరుకాకుండా తప్పించుకు తిరుగుతున్న ప్రకాశం జిల్లా లక్ష్మీనరసాపురం గ్రామ నివాసి పోలు మహేష్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ బి.రవిప్రకాస్‌రెడ్డి తెలిపారు. వాయిదాలకు హాజరు కాకపోవడంతో నిందితుడు మహేష్‌ను అరెస్ట్ చేయాలని నందలూరు కోర్టు రాజంపేట పోలీసులను ఆదేశించింది. దీంతో హైదరాబాదులో ఉన్న నిందితుడిని హెడ్‌కానిస్టేబుల్ శివనాగరాజు, కోర్టు కానిస్టేబుల్ శివమహేంద్రతో కలసి ఎస్ఐ బి. రవిప్రకాష్ రెడత్తి మంగళవారం రాత్రి అరెస్ట్ చేసి, బుధవారం రూరల్ సీఐ బీవీ రమణ ఎదుట హాజరుపరచగా, ఆయన నిందితుడిని నందలూరు కోర్టులో హాజరు పరిచారు. కోర్టు నిందితుడికి శిక్ష విధించి కడప సబ్‌జైలుకు పంపించినట్లు ఆయన తెలిపారు.

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు

రైల్వేకోడూరు, అక్టోబరు 16:(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో మండలంలోని గందెద్దుల మిట్ట, జానకీపురం, శెట్టిగుంట, శ్రీనివాసపురం, కోడూరు నారాయణ స్కూలులో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొండయ్య ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ప్రజలకు వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిస్థితులకు అనుగుణంగా సేవలు అందించేందుకు వైద్య ఆరోగ్య శాఖ సిద్ధంగా ఉందన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కాగా రాజంపేట డీఎస్పీ నాంపల్లె సుధాకర్ రైల్వేకోడూరులో పరిస్థితులను పర్యవేక్షించారు. పోలీసు అధికారులు, సిబ్బందిని ఎప్పటికప్పుడు వరద ప్రాంతాలను పర్యవేక్షించాలని ఆదేశించారు. వరద ఉధృతి ఎక్కువైతే ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలిస్తామని ఆయన తెలిపారు. సహాయ చర్యలకు పోలీసులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. రైల్వేకోడూరు సీఐలు హేమసుందర్‌రావు, వెంకటేశ్వర్లు, ఎస్ఐ నవీన్‌బాబు తదితర సిబ్బంది వరద బాధిత ప్రాంతాల్లో తిరిగి ప్రజలను అప్రమత్తం చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమం లో హెల్త్ సూపర్‌వైజర్ బాలక్రిష్ణంరాజు, డిప్యూటి ఎన్నికల అధికారి గల్లా రమణ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందులు తప్పనిసరి



గొర్రెలకు నట్టలనివారణ మందులు వేయిస్తున్న గుణశేఖర్‌పిళ్లై

లక్కిరెడ్డిపల్లె అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందులు తప్పకుండా వేయించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి గుణశేఖర్ పిళ్లై సూచించారు. బుధవారం మండలంలోని మద్దిరేవుల వంకగడ్డ రాచపల్లెలో పశు వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గొర్రెలకు నట్టల నివారణ మందులు వేశారు. అనంతరం గొర్రెలు, మేకలు పెంపకం దారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 16 నుంచి 30వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి సన్న జీవాలకు నట్టల నివారణ మందులు వేయించుకోవాలన్నారు. వర్షాలు కురుస్తున్న సందర్భంగా సన్న జీవాలను స్థిరమైన పాకలో మిట్ట ప్రాంతంలో ఉంచాలన్నారు. పశువులను విద్యుత్ స్తంభాలకు కట్టరాదన్నారు. వర్షాకాలంలో మేకలకు, గొర్రెలకు గాలికుంటు వ్యాధి వచ్చే అవకాశం ఉందన్నారు. వర్షాకాలంలో సన్నజీవాల కాళ్లను వేడి నీళ్లతో కడగాలన్నారు. కాళ్లలో పురుగులు పడకుండా జాగ్రతలు తీసుకొని పశువైద్యాధికారిని కలవాలన్నారు. పశు వైద్యశాలలో ఉచితంగా మందులు పొందవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో రాయచోటి ఉప సంచాలకులు డాక్టర్ మాలకొండయ్య, లక్కిరెడ్డిపల్లె ఏడీ సుధీర్‌నాథ్ బెనర్జీ, పశువైద్యాధికారి మహేశ్, పశుసంవర్ధక సహాయకులు శాంతిరాజ్, రాధిక, ఓబులయ్య, పాడి రైతులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

రాజంపేట, అక్టోబరు, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కారంపల్లె, చెర్లోపల్లె, మందపల్లె, పులపత్తూరు, ఊటుకూరు గ్రామాల్లో బుధవారం పశువైద్యాధికారులు పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా రాజంపేట పశువైద్య సహాయ సంచాలకులు కె.ప్రతాప్, పశువైద్యాధికారులు డాక్టర్ ఎస్.శరత్‌కుమార్‌రెడ్డి, భాగ్యవతి, వరదయ్య మాట్లాడుతూ వర్షాకాలంలో పశువులకు పలు రకాల వ్యాధులు వస్తుంటాయని ఎప్పటికప్పుడు తమకు తెలియజేస్తే టీకాలు వేసి వ్యాధులు రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్యసిబ్బంది ఎం.రమేష్. వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు భూమి పంపిణీ చేయాలి



వర్షంలో ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

లక్కిరెడ్డిపల్లె అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో అర్హులైన నిరుపేదలను గుర్తించి భూములు పంపిణీ చేయాలంటూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ నాయకులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రాయచోటి నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ప్రభుత్వ భూములను దోచుకున్నారని ఆరోపించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో 7 సార్లు భూములు పంపిణీ చేశారని గుర్తు చేశారు. తరువాత వచ్చిన ప్రభుత్వాలు, బడుగు బలహీన వర్గాల వారికి మొండిచేయి చూపించాయన్నారు. ఇప్పటికైన రెవిన్యూ అధికారులు స్పందించి కబ్జాకు గురైన భూములను స్వాధీనం చేసుకుని నిరుపేదలకు పంపిణీ చేయాలని కోరారు. లేని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఆర్ఐ రాజేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఓబులేసు, రెడ్డిచరణ్, భాగ్యమ్మ, లక్ష్మీదేవి, నాగరత్నమ్మ, నరేష్ తదితరులు పాల్గొన్నారు

'విజయవాడ బహిరంగ సభకు తరలి రండి'

రాయచోటిటౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా డిసెంబర్ 4న విజయ వాడలో జరిగే బహిరంగ సభను విజయవంతం చే యాలని సీపీఐ ఎంఎల్ లిబ రేషన్ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు శంకర్, రాష్ట్ర కార్యదర్శి బంగార్రావు పిలుపునిచ్చారు. బుధవారం రాయచోటి పట్టణంలోని ఆ పార్టీ జిల్లా కార్యా లయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఆ బహిరంగ సభకు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య హాజరవుతారని చెప్పారు. అన్నమయ్య జిల్లాలో పార్టీని విస్తరింపజేసేందుకు ముఖ్య నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలన్నారు. జిల్లాలో నెలకొన్న సమస్యలపైన నిరంతరం రాజీలేని పోరాటాలు చేయాలని పిలుపు నిచ్చారు. మారుమూల గ్రామాల్లో పార్టీని క్షేత్రస్థాయిలో పటిష్టం చేయాల న్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఉదయ్‌కిరణ్, సత్తార్, అన్నమయ్య జిల్లా నాయకులు మావు లూరి విశ్వనాథ్, సిగి చెన్నయ్య, ఏఐఎస్ఏ అన్నమయ్య జిల్లా కార్యదర్శి తుమ్మల లవకుమార్, లిబరేషన్ పార్టీ కార్యకర్తలు రమణ, రఘునాథ్, సుజాత, నీలావతి, ఆంజినేయులు, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

'ఆలయాలతోనే సనాతన ధర్మం మనుగడ'

రామాపురం, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): ఆలయాల నిర్మాణంతో సనాతన ధర్మం పెంపొందుతుందని మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని నీలకంఠ్రావుపేటలోన్ని ఆంజనేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామస్తులు స్వాగతం పలికి, పూజలు చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు. రామసుబ్బారెడ్డి, అయూబ్‌ఖాన్, సిరాజ్, సుబ్బారెడ్డి, శ్రీనివాసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి

● కొడుకుకు తీవ్ర గాయాలు



మృతి చెందిన నరసింహరాజు (ఫైల్ ఫొటో)

రైల్వేకోడూరు(రూరల్), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): బైక్‌ను కారు ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందగా, అతని కుమారుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి...రైల్వేకోడూరు మండలం మాధవరంపోడు పంచాయతీకి చెందిన సన్నకారు రైతు శంకుపల్లి నరసింహరాజు(47), మంగళవారం తన కుమారుడు కుషాల్‌తో కలసి మోటారు సైకిల్‌లో రైల్వేకోడూరుకు వెళుతుండగా హైద్రాబాద్ నుంచి తిరుమలకు వెళుతున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ తిరుపతి లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం కూడా పరిస్థితి విషమంగా ఉండడంతో తమిళనాడు రాష్ట్రం వేలూరు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ నరసింహరాజు (47) మంగళవారం రాత్రి మృతి చెందాడు. కుషాల్ వేలూరు చికిత్స పొందుతున్నాడు. బుధవారం రైల్వేకోడూరు ప్రభుత్వ ఆస్పత్రిలో శవ పరీక్ష నిర్వహించారు. మృతుడికి భార్య ఉమామహేశ్వరి, ఇద్దరు కుమారులు తరుణ్‌కుమార్‌రాజు, కుషాల్‌రాజు ఉన్నారు. తండ్రి మరణ వార్త కుమారుడికి తెలియదని బంధువులు తెలిపారు. ఈ సంఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏడాది పొడవునా టమోటా పంట సాగు చేస్తూ నష్టాలు చవిచూస్తున్న పడమటి ప్రాంత రైతులకు ఓ రైతు వంగ సాగులో లాభాలు రుచి చూపిస్తున్నారు. టమోటా సాగులో అవలంబించే కట్లు, తీగ పద్ధతిలోనే వంగ సాగును వినూత్నంగా చేపట్టి, మేలైన వంకాయలను అధిక దిగుబడితో పండించడమే కాకుండా వాటిని చెన్నైకు ఎగుమతి చేస్తున్నారు.

వినూత్నంగా సాగు చేసిన వంకాయ తోట





ఏపుగా కాసిన వంకాయలు

వినూత్నంగా వంగ సాగు

● ఎకరాకు రూ.5 లక్షల లాభం ● వంకాయలు చెన్నైకు ఎగుమతి

మదనపల్లె టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వంగ సాగులో రైతులు సాధారణ పద్ధతిలో సాగు చేస్తూ తెగుళ్లు, పురుగుల దెబ్బకు సరైన దిగుబడి రాక నష్టాల పాలైన సంఘటనలో కోకొల్లలు. అలాంటి వంగ పంటకు తెగుళ్ల దెబ్బపడకుండా, పురుగుల నుంచి కొత్త పద్ధతుల్లో రక్షణ కల్పిస్తూ అధిక దిగుబడులు సాధిస్తూ తోటి రైతులకు మార్గదర్శంగా నిలిచారు మదనపల్లె మండలం సీటీఎం గ్రామానికి చెందిన రైతు ఆనంద పార్థసారథి. సీటీఎం-పెద్దపల్లె మార్గంలో రెండెకరాల భూమిని లీజుకు తీసుకున్న ఆయన లోతు దుక్కులతో భూమిని దున్ని, ఆవుపేడ ఎరువులతో సారవంతం చేశారు. సాధారణ వంకాయల సాగుకు ప్రత్యామ్నాయంగా మంచి రంగు, పొడవు ఉండే వంకాయలను పండించడానికి నడుం బిగించాడు. నర్సరీ నుంచి ఉజాల రకం వంకాయ మొక్కలను కొనుగోలు చేసి తీసుకొచ్చాడు. దుక్కులు దున్నిన భూమిలో మల్చింగ్ పేపర్ వేసి ఎకరాకు 7 వేల చొప్పున మొక్కలు నాటారు. నాటిన మొక్కలకు డ్రిప్ పద్ధతిలో నీటిని అందిస్తూ అడుగు పొడవు పెరిగాక వంకాయ మొక్కలను పొడవుగా పెరిగేందుకు స్టాక్స్ (ప్లాస్టిక్ తీగలు) కట్టారు. పది అడుగులకు ఒకచోట కర్రలను నాటి, ఆ కర్రలకు ప్లాస్టిక్ తీగలు అడ్డంగా కట్టాడు. ఈ ప్లాస్టిక్ తీగల కిందికి జొన్నపుర్రిలకు వంకాయ మొక్కల రెమ్మలు కట్టి పైకి ఎగబాకేలా ఊతం ఇచ్చారు. నెల రోజుల్లో ఐదడుగుల ఎత్తు పెరిగిన వంగ మొక్కలు పూత పూయడం ప్రారంభించాయి. 30 నుంచి 50 రోజుల్లో పూత పిందె పట్టి, కాయలు కాయడం మొదలు పెట్టాయి.

ఈ రకం వంకాయ సాగును వేసవిలో సాగు చేస్తే తెగుళ్లు, చీడ పురుగుల బెడద లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవచ్చు. శీతాకాలంలో పురుగులు ఎక్కువగా పడే అవకాశం ఉంది. దీనిని బట్టి చూస్తే జనవరి నుంచి అక్టోబరు వరకు ఈ రకం వంగ పంట సాగుకు అనుకూలం. పచ్చదోమ తక్కువగా, తెల్లదోమలు ఎక్కువగా ఈ పంటను ఆశిస్తాయి. వీటిని గమనించుకుంటూ వారానికి ఒకసారి మందులు పిచికారీ చేస్తే, ఆరు నెలల పాటు వంకాయలు కోతలు పడతాయి.



పొడవైన వంకాయలు

ఎకరాకు 15 టన్నుల దిగుబడి

వంకాయ సాధారణ సాగులో ఎకరాకు 8 నుంచి 10 టన్నుల వంకాయలు మాత్రమే దిగుబడి వస్తుంది. అదే స్టాక్స్ పద్ధతిలో మేలు రకం వంకాయ సాగులో ఎకరాకు 15 టన్నుల దాకా దిగుబడి వస్తోంది. ఎకరా విస్తీర్ణం సాగులో తొలికోతలో 300 కిలోల దిగుబడి రాగా, తరువాత వరుస కోతల్లో 1000, 2000, 3500 కిలోల దాకా వంకాయలు పండుతున్నాయి. రెండు నెలల్లో 14 కోతలు కోయగా సరాసరిన 15 వేల కిలోలు వంకాయలు దిగుబడి వచ్చాయి.

లాభాల పంట

ఈ రకం వంకాయ సాగులో రైతులు లాభాలు చవిచూడొచ్చు. ఎకరా వంకాయ సాగుకు ఎకరాకు రూ.1.65 లక్షలు పెట్టుబడి పెట్టాల్సి వుంది. ఇలా సాగు చేసిన వంకాయ పంట ఎకరాకు 15 టన్నుల దిగుబడి వస్తుంది. చెన్నైలో కిలో వంకాయ రూ.30 కనీస ధర పలికినా రూ.4.50 లక్షలు వస్తుంది. ఖర్చులు పోను ఎకరాకు ఎంత లేదన్నా కనీసంగా రూ.3 లక్షలు లాభాలు వస్తున్నాయి. డిమాండ్ పెరిగితే ఒక్కోసారి హోల్‌సేల్ మార్కెట్‌లో కిలో వంకాయలు రూ.100 కూడా పలుకుతాయి. దీనిని బట్టి చూస్తే రైతులకు ఎకరాకు అన్ని ఖర్చులు పోను గ్యారెంటీగా రూ.5 లక్షలు వరకు లాభం వస్తుందని అంచనా.

పంట మార్పిడితోనే భూమి సారవంతం



ప్రతి ఏటా వ్యవసాయంలో రైతులు పంట మార్పిడితో భూమి సారవంతం చేయొచ్చు. అలాగే తెగుళ్లు, చీడ పీడలు అంతగా సోకే ఆస్కారం లేకుండా చేయొచ్చు. ఎంత వర్షాలు వచ్చినా ఎర్రరేగడి నేలలో టమోటా, వంకాయల సాగులో మొక్కలు నీటి నిల్వలను తట్టుకుంటాయి. మూడు రోజులకు ఒకసారి నీటి తడి అందిస్తే చాలు. వంకాయ మొక్కలు ఏపుగా పెరుగుతాయి. వంకాయ సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడి రావడమే కాకుండా, నాణ్యమైన వంకాయలు చేతికి అందుతాయి. మదనపల్లె ప్రాంతంలో ఈ రకం వంగ సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. కానీ ఇక్కడ మార్కెటింగ్ లేక చెన్నైకు రవాణా చేయాల్సి వస్తోంది. మదనపల్లెలో ప్రభుత్వం వంకాయ మార్కెట్ ఏర్పాటు చేస్తే రైతులకు రవాణా ఖర్చు తగ్గిపోయి, ఇంకా రాబడి పెరుగుతుంది.

- ఆనంద పార్థసారథి,
రైతు, సీటీఎం గ్రామం.

మిగిలిన ప్రభుత్వ మద్యం సీజ్


మదనపల్లెటౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె ఎక్సైజ్ పోలీసుస్టేషన్ పరిధిలోని ఇదివరకు నిర్వహించిన 22 ప్రభుత్వ మద్యం దుకాణాలకు ఎక్సైజ్ సీఐ భీమలింగ ఆధ్వర్యంలో సీజ్ చేశారు. బుధవారం మదనపల్లె, రామసముద్రం, నిమ్మనపల్లె, కురబలకోట, బి.కొత్తకోట మండలాల్లోని 22 ప్రభుత్వ మద్యం దుకాణాలను ప్రత్యేక బృందాలతో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రభుత్వ మద్యం దుకాణాల్లో మిగిలిన మద్యం స్టాకును రెవెన్యూ అధికారుల సమక్షంలో పంచనామా నిర్వహించి, సీజ్ చేశామన్నారు. ప్రభుత్వ ఆదేశాలు వచ్చిన వెంటనే ఈ మద్యాన్ని ఎక్సైజ్ డిపో అధికారులకు అప్పగిస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎక్సైజ్ ఎస్ఐలు జబీవుల్లా, డోర్కాస్, హెచ్‌సీ అలీ తదితరులు పాల్గొన్నారు.



మద్యం దుకాణాన్ని సీజ్ చేస్తున్న అధికారులు

సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.లక్ష విరాళం

పీలేరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): విజయవాడ వరద బాధితుల సహాయ నిధికి పీలేరులోని పారా మిలటరీ అసోసియేషన్ సభ్యులు రూ.లక్ష విరాళం అందజేశారు. విజయవాడలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో బుధవారం వారు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఈ మేరకు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు పీఎస్ ఖాన్, కార్యదర్శి పి.చంద్రశేఖర్, అడ్వైజర్ బీసీ రెడ్డప్ప, కోశాధికారి రమణబాబు, తదితరులు పాల్గొన్నారు.



విరాళం చెక్కును ముఖ్యమంత్రికి అందజేస్తున్న పీలేరు వాసులు

మున్సిపల్ పూర్వ కమిషనర్ ఇంక్రిమెంట్లలో కోత

● మరో ఇద్దరు ఉద్యోగులకూ కోత....

కలికిరి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో గతంలో పనిచేసిన కమిషనరుతో సహా మరో ఇద్దరు ఉద్యోగులు భవన నిర్మాణాల అనుమతుల విషయంలో అక్రమాలకు పాల్పడ్డారనే కారణంతో రెండేసి ఇంక్రిమెంట్లలో కోత విధిస్తూ ప్రభుత్వం బుధవారం ఆదేశాలు చేసింది. 2021లో ప్రొద్దుటూరు మున్సిపల్ కమిషనరుగా పనిచేసిన పి.వి.వి.ఎస్. మూర్తి భవన నిర్మాణాలకు నిబంధనలకు విరుద్ధంగా అనుమతులిచ్చారని, అనధికార నిర్మాణాల తొలగింపు విషయంలో చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని, సెట్ బ్యాక్ నిబంధనలను అతిక్రమించినా పట్టించుకోలేదన్న అభియోగాలతో ఆయనకు గతంలో ప్రభుత్వం నోటీసులిచ్చింది. దీని పైన కమిషనరు ఇచ్చిన సంజాయిషీలు విచారణలో నిలవకపోవడంతో చివరికి రెండు వార్షిక ఇంక్రిమెంట్లలో కోత విధించాలని నిర్ణయించి ఆ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఇదే విధమైన అభియోగాలతో జరిగిన విచారణలో అప్పట్లో మున్సిపాలిటీ టీపీఎస్‌గా పనిచేస్తున్న సి.టి.కృష్ణసింగ్, టీపీబీవోగా పనిచేస్తున్న ఎస్.మహబూబ్ బాషాలపై కూడా నిర్ధారణ కావడంతో ఇరువురి ఇంక్రిమెంట్లలో రెండేసి వంతున కోత విధించారు. ఈ మేరకు మున్సిపల్ వ్యవహారాలు, పట్టణాభివృద్ధి రాష్ట్ర ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అనిల్ కుమార్ సింఘాల్ బుధవారం విడివిడిగా ఆదేశాలు జారీ చేశారు.

పీటీడీ ఇంజనీరుకు కర్నూలు బాధ్యతలు

కడప ప్రజా రవాణా శాఖ (ఏపీఎస్ఆర్టీసీ)లో డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీరుగా పనిచేస్తున్న పి.ఎల్.భాస్కర్‌కు కర్నూలు పీటీడీ డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీరుగా అదనపు బాధ్యతలు అప్పగించారు. మూడు నెలల వరకు గానీ లేదా రెగ్యులర్ నియామకం జరిగే వరకు గానీ ఈ బాధ్యతలు నిర్వర్తించాలని రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

మెడికల్ కాలేజీ అసోసియేట్ ప్రొఫెసర్ కడపకు బదిలీ

మదనపల్లె ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పాథాలజీ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ స్పందనను ప్రభుత్వం బదిలీ చేసింది. కడప ప్రభుత్వ మెడికల్ కళాశాలలో అదే విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా నియమించింది. మానవతా దృక్పథంతో బదిలీలపై ఉన్న నిషేధాన్ని సడలించి ఆదేశాలిస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. అదే విధంగా కడప ప్రభుత్వ వైద్య కళాశాలలో ఈఎన్‌టీ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ బి.సుధను విజయనగరం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో అదే విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా బదిలీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు బుధవారం వేర్వేరు ఉత్తర్వులు జారీ చేశారు.

వెటర్నరీ లైవ్ స్టాక్ అధికారి డిప్యుటేషన్ పొడిగింపు

కడప జిల్లా లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ అసోసియేషన్‌లో వెటర్నరీ లైవ్ స్టాక్ అధికారిగా డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న డాక్టర్ ఎస్.పెంచలరాజుకు మరో ఏడాది డిప్యుటేషన్ పొడిగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జూలై 16 నుంచి 2025 జూలై 15వ తేదీ వరకూ ఈ డిప్యుటేషన్‌ను పొడిగించారు. కాగా కడప పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న డాక్టర్ జి.శ్రీనివాసులురెడ్డికి నెల రోజుల సెలవును ప్రభుత్వం మంజూరు చేసింది. వ్యక్తిగత పనుల మీద అమెరికా వెళ్లేందుకు అనుమతిస్తూ నవంబరు 23వ తేదీ నుంచి డిసెంబరు 24 వరకూ ఈ సెలవును మంజూరు చేసింది. ఈ రెండు ఉత్తర్వులను రాష్ట్ర పశు సంవర్ధక శాఖ కార్యదర్శి ఎం.ఎం.నాయక్ జారీ చేశారు.

అందరూ అప్రమత్తంగా ఉండాలి

● సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

నిమ్మనపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ తెలిపారు. బుధవారం ముష్టూరులోని బాహుదా ప్రాజెక్టును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ తుఫాన్ కారణంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు ఉండడంతో అధికారులు నిత్యం పర్యవేక్షణలో ఉండాలన్నారు. అలాగే బాహుదా ప్రాజెక్టుకు ఎన్ని గేట్లు ఉన్నాయి.. ప్రాజెక్టు సామర్థ్యం, పూర్తి స్థాయిలో నిండి ఎంత కాలమైంది.. అనే విషయాలను అధికారులను అడిగారు. అదే విధంగా వర్షాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు గ్రామాల్లో పర్యటించి పంటల నష్టం వివరాలను తెలుసుకోవాలన్నారు. అలాగే కుంటలు, చెరువుల వద్ద ప్రజలు వెళ్లకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ సురేంద్రరెడ్డి, డీఈ ప్రసాద్, తహసీల్దార్ ధనంజేయులు, ఏఈఈ శ్రీహరి రెడ్డి, ఆర్ఐ రాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



బాహుదా ప్రాజెక్టు వద్ద సబ్ కలెక్టర్

చెరువు కట్టల పటిష్టతపై దృష్టి పెట్టండి : ఎమ్మెల్యే

మదనపల్లెటౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణానికి పడమర వైపున ఎగువన వున్న మూడు చెరువుల పటిష్టతపై అధికారులు దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆదేశించారు. బుధవారం మండలంలోని చీకిలబైలు పంచాయతీ మేడిపల్లె చెరువు, కదిరమ్మచెరువు, వెంకటమ్మ చెరువులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1996 సంవత్సరంలో వరదలు వచ్చినప్పుడు మూడు చెరువులు తెగిపోయి వరద నీరంతా మదనపల్లె పట్టణం మీద పడి అనేకమంది మృతి చెందారని గుర్తుచేశారు. ప్రస్తుతం ఇలాంటి పరిస్థితులు పునరావృత్తం కాకుండా చెరువుకట్టల స్థితిపై ఇరిగేషన్ అధికారులు అధ్యయనం చేసి నివేదికలు ఇవ్వాలన్నారు. చెరువు కట్టలు బలహీనంగా ఉంటే ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కాగా కదిరమ్మ చెరువును, అక్కడ వున్న పరిస్థితులను సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ పరిశీలించారు. బుధవారం తహసీల్దార్ ఖాజాబీ, జల వనరులశాఖ అధికారులతో కలసి చెరువు కట్టను పరిశీలించారు. చెరువు కట్ట ఎక్కడైనా తెగిపోయే అవకాశం వుందా.. అలాంటివి జరగకుండా ముందస్తు చర్యలపైన ఇంజినీర్లతో చర్చించారు. ఈ కార్యక్రమంలో జల వనరులశాఖ ఈఈ సురేంద్రరెడ్డి, ఏఈ రాయలబాబు రాజేంద్రప్రసాద్, ఆర్ఐ రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.



కదిరమ్మచెరువు కట్టపై అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే

పీలేరుకు తప్పిన ఏనుగుల బెడద

● కల్లూరు ఘాటుకు తరలిన గుంపు ● ఫలించిన అటవీ శాఖ సిబ్బంది యత్నాలు

పీలేరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పీలేరును వణికించిన గజరాజుల బెడద తప్పింది. పీలేరు ఇందిరమ్మ కాలనీ వద్ద తిష్ట వేసిన 15 ఏనుగుల గుంపును అటవీ ప్రాంతంలోకి పంపేందుకు అటవీ సిబ్బంది చేసిన ప్రయత్నాలు ఫలించాయి. జనావాసాలకు దూరంగా చిత్తూరు-పీలేరు మార్గంలోని కల్లూరు ఘాటు సమీపంలో ఉన్న గంటావారిపల్లె అటవీ ప్రాంతంలోకి వాటిని మళ్లించగలిగారు. దీంతో ఇందిరమ్మ కాలనీతోపాటు పరిసర ప్రాంతాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అయితే వాటిని అటవీ ప్రాంతం వైపు మళ్లించే క్రమంలో అవి ప్రయాణించిన మార్గంలోని పంట పొలాలు పాక్షికంగా ధ్వంసమయ్యాయి. వరి, టమోటా, మామిడి, కొబ్బరి పంటలు దెబ్బతిన్నాయి. పీలేరు, మదనపల్లె సెక్షన్ల అటవీ సిబ్బంది బుధవారం ఆయా ప్రాంతాల్లో పర్యటించి పంట నష్టాన్ని పరిశీలించారు. తాము పరిశీలించిన వివరాలను అటు వ్యవసాయ, ఇటు ఉద్యాన శాఖాధికారులకు అందజేసి ఆయా రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకుంటున్నారు.



ఏనుగులు ధ్వంసం చేసిన టమోటా పంటను పరిశీలిస్తున్న ఫారెస్టు సిబ్బంది

కుప్పం టు పులిచెర్ల, పులిచెర్ల టు పీలేరు

పీలేరుకు వచ్చిన ఏనుగుల మంద ఎక్కడిదని మంగళవారం పీలేరు ప్రాంతంలో పెద్దఎత్తున చర్చ జరిగింది. పీలేరుకు తలకోన, మంగళంపేట అటవీ ప్రాంతం సమీపంలో ఉండడంతో తలకోన నుంచి అవి వచ్చి ఉంటాయని చాలా మంది భావించారు. అయితే అవి తలకోనకు చెందినవి కావని, పలమనేరులోని కౌండిన్య అభయారణ్యం నుంచి చాలా కాలం క్రితం సోమలవైపు వచ్చిన గుంపులోనివేనని అటవీ సిబ్బంది బుధవారం నిర్ధారించారు. నాలుగు రోజులుగా పులిచెర్ల మండలం మంగళంపేట ప్రాంతంలోని అటవీ సిబ్బంది, రైతులు పెద్దఎత్తున బాణాసంచా పేల్చి వాటిని అడవిలోకి మళ్లించే ప్రయత్నాలు చేశారు.

అధిక మోతాదులో జరిగిన పేలుళ్లు, వర్షం కారణంగా అవి దారితప్పి పీలేరు ప్రాంతంలోకి ప్రవేశించినట్లు మదనపల్లె, పీలేరు సెక్షన్ల అటవీ సిబ్బంది నిర్ధారించారు. ఏనుగులు ప్రయాణించిన మార్గంలోని పీలేరు మండలంలోని కాకులారంపల్లె పంచాయతీ చిన్న గాండ్లపల్లె, పెద్దగాండ్లపల్లె, ఆవులవారిపల్లె, రామిరెడ్డిగారిపల్లె, పులిచెర్ల మండలంలోని కొన్ని గ్రామాల్లో వరి, టమోటా, మామిడి, కొబ్బరి పంటలకు నష్టం వాటిల్లింది. పంట నష్టం జరిగి ఉంటుందని అంచనా వేసిన మదనపల్లె సెక్షన్ ఫారెస్టు సిబ్బంది వేణుగోపాల్, గిరి, సుధాకర్, షాజహాన్, శోభారాణి, రామ్మోహన్, దీప, జ్యోతి బుధవారం వేకువజామునే ఆయా గ్రామాలకు చేరుకుని 13 మంది రైతులకు చెందిన పంటలకు నష్టం వాటిల్లినట్లు నిర్ధారించారు. మంగళవారం ఏనుగులు తిష్ట వేసిన మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు యల్లెల రెడ్డప్పరెడ్డి తోటకు కూడా భారీగా నష్టం వాటిల్లినట్లు అధికారులు తేల్చారు. ఏనుగుల దాడిలో మంగళవారం ఉదయం మరణించిన రైతు చిన్న రాజారెడ్డి అంత్యక్రియలు బుధవారం ఆయన స్వగ్రామం బందార్లవారిపల్లెలో జరిగాయి.

'పాల'సముద్రం

● దినాదినాభివృద్ధి చెందుతున్న పాల ఉత్పత్తి
● డ్వాక్రా మహిళలకు కల్పతరువు పాడి పరిశ్రమ

పాడి పరిశ్రమ ఆర్థిక ప్రగతికి చక్కని సోపానమని చెప్పవచ్చు. వ్యవసాయ రంగం ఒడిదుడుకుల కారణంగా చాలామంది రైతులు ఆర్థికంగా చితికిపోతున్నారు. ఇలాంటి తరుణంలో పశుపోషణ ద్వారా పాడి పరిశ్రమను ఏర్పాటు చేసుకుంటే ఆర్థిక ఇబ్బందులు తొలుగుతాయి. రామసముద్రం మండలంలో అత్యధికమంది ప్రజలు పశుపోషణపై ఆధారపడి జీవిస్తున్నారు. ఇక్కడ రోజు దాదాపు 5 వేల లీటర్ల పాలను అమ్ముతున్నారు. దీంతో ఈ మండలాన్ని పాలసముద్రంగా పిలుచుకుంటున్నారు.



రామసముద్రం, అక్టోబరు 16: రామసముద్రం మండలంలో పాడి పరిశ్రమ దినదినాభివృద్ధి చెందుతోంది. మూడు సంవత్సరాలుగా వర్షాలు బాగా పడి భూగర్భజలాలు వృద్ధి చెందాయి. దీంతో రైతులు తమ బీడు భూములు సైతం సాగు చేసి పశుగ్రాసం పెంచి పాడి పరిశ్రమ వైపు మొగ్గు చూపుతున్నారు. గత కొంతకాలంగా పాల ధరలు రోజురోజుకు పెరుగుతుండడం, పశువులపై పెట్టిన పెట్టుబడి వ్యయం స్థిరంగా ఉండడం, రోజువారీ నిలకడమైన ఆదాయం వస్తుండడంతో రైతులు పశుపోషణపై మక్కువ చూపుతున్నారు. తమ వ్యవసాయ పొలంలోనే డెయిరీ ఫామ్ ఏర్పాటు చేసి పశుపోషణ చేస్తూ లాభాలను పొందుతున్నారు. రైతులు పశుపోషణను ఎన్నుకోవడానికి ప్రధాన కారణం పంటలపై పెట్టిన పెట్టుబడి నిలకడగా లేని ధరలతో నష్టాలను చవిచూడడం, పాల ధరలు రోజురోజుకు పెరుగుతుండడంతో రైతులు పశుపోషణపై ఆసక్తి చూపుతున్నారు. అంతేకాకుండా ఇతర పంటల మార్కెటింగ్ ఖర్చుతో పోలిస్తే పాల మార్కెటింగ్ ఖర్చులు చాలా తక్కువగా ఉండడం కూడా పశుపోషణకు మరో కారణంగా చెప్పవచ్చు. మండలంలో 13 వేల పశువులు ఉన్నట్లు అంచనా. వాటి ద్వారా రోజుకు సుమారుగా 50 వేల లీటర్ల పాలు ఉత్పత్తి అవుతున్నట్లు తెలుస్తోంది. మండల కేంద్రంలోనే దాదాపుగా రోజుకు 5 వేల లీటర్ల పాలు ఉత్పత్తి అవుతుండడంతో రామసముద్రంను పాలసముద్రంగా పలు డెయిరీల యజమానులు అభివర్ణిస్తున్నారు. మండల పరిధిలో తిరుమల డెయిరీ, అమూల్ డెయిరీకి సంబంధించిన పాల సేకరణ కేంద్రాలు ఉన్నాయి. ఇవి కాకుండా మదనపల్లె కేంద్రంగా ఉంటూ రామసముద్రం మండలంలోని వివిధ గ్రామాల్లో పాల సేకరణ చేస్తున్న డెయిరీలు ఉన్నాయి. వాటిలో సంగం, హెరిటేజ్, దొడ్ల, జెర్సీ, శ్రీకృష్ణ, బాలాజి డెయిరీలు ఉన్నాయి. ఇవే కాకుండా మండల సరిహద్దులో ఉన్న కర్ణాటక రాష్ట్రంలోని కేఎంఎఫ్, మూమార్క్ డెయిరీలు సైతం రామసముద్రం మండలంలోని పలు ప్రాంతాల్లో తమ పాల సేకరణ కేంద్రాలు ద్వారా పాలను సేకరిస్తున్నారు. దీంతో పాల సేకరణలో పోటీతత్వం పెరిగి పాలకు గిట్టుబాటు ధరలు లభిస్తున్నాయి. ప్రస్తుతం దాదాపు అన్ని పాల డెయిరీలు నాలుగు శాతం వెన్న, ఎనిమిది శాతం ఎస్ఎన్ఎఫ్ ఉన్న పాలకు రూ.34 నుంచి రూ.36 చెల్లిస్తున్నారు. రాబోయే రోజుల్లో ఇది మరింతగా పెరిగి అవకాశాలు ఉన్నట్లు పాల సంస్థ యజమానులు అంటున్నారు. పశుపోషణ లాభదాయకంగా ఉండడంతో ఉన్నత చదువులు చదివిన వారు ఉద్యోగం కోసం ఎదురుచూడక పశుపోషణతో లాభాలు గడిస్తున్నారు.



డెయిరీకి పాలు పోస్తున్న డ్వాక్రా మహిళలు


పశుపోషణ ఓ కల్పతరువు

పశుపోషణ కుటుంబం ఇంటిల్లిపాది చేస్తూ ఒక కుటీర పరిశ్రమగా ఉండడంతో పాల ఉత్పత్తిలో మహిళలది ప్రముఖ స్థానం అని చెప్పవచ్చు. ముఖ్యంగా డ్వాక్రా సంఘాల మహిళలు తమ పొదుపు సంఘాల ద్వారా ఆర్థిక రుణాలు పొంది వాటిని పశుపోషణపై వెచ్చించి ఆర్థికాభివృద్ధి చెందుతున్నారు. రుణాలు సకాలంలో చెల్లిస్తుండడంతో బ్యాంక్‌లు మహిళలకు మరింతగా రుణాలు అందించడానికి మొగ్గు చూపుతున్నారు. అంతేకాక జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పశుగ్రాసం పెంపకానికి ఆర్థిక చేదోడు అందుతుండడంతో పశుపోషణ సులువుగా ఉంది. పాలతో ప్రతిరోజూ నిలకడైన ఆదాయంతో కుటుంబ పోషణకు మహిళలు ఆసరాగా ఉన్నారు.



పొలంలో షెడ్ వేసి ఆవులను పెంచుతున్న దృశ్యం

లాభదాయకంగా ఉంది..



గత పదేళ్లుగా వ్యవసాయం చేస్తున్నాను. ఇందులో దానిమ్మ, కొత్తిమీర తదితర పంటలు సాగు చేసి సరైన గిట్టుబాటు ధరలు లేక లక్షల్లో నష్టం వాటిల్లింది. దీంతో వ్యవసాయం వదిలేసి ఆరునెలల ముందు రూ.10 లక్షలు ఖర్చుతో 6 ఆవులు, వాటికి షెడ్డు నిర్మించుకున్నాను. నాలుగు ఎకరాల్లో కొంత హైబ్రిడ్ పశుగ్రాసం మరికొంత మొక్కజొన్న పశుగ్రాసం సాగు చేశాను. ఇప్పుడు రోజుకు 60 లీటర్ల పాలు డెయిరీకి వేస్తున్నాను. దీని ద్వారా రోజుకు రూ.2 వేల ఆదాయం వస్తోంది. ఖర్చులు పోను రోజుకు రూ.1500 మిగులుతోంది. దీనికి తోడు పశు వ్యర్థాలు పొలాలకు ఎరువులుగా ఉపయోగపడుతోంది. అంతేకాకుండా పశువుల రొట్టతో పంటల దిగుబడి పెరిగింది.

-వెంకటేష్, రైతు.

వైవీయూ పీజీ కోర్సుల్లో నేరుగా ప్రవేశాలు

కడప (ఎడ్యుకేషన్), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వైవీయూలో ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకామ్, ఎంపీఈడీ కోర్సుల్లో ఈనెల 17 నుంచి 27వ తేదీ వరకు నేరుగా అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రవేశాల సంచాలకులు డాక్టర్ లక్ష్మీప్రసాద్ తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఒరిజనల్ సర్టిఫికెట్లు రెండుసెట్ల జిరాక్స్, నిర్ణీత ఫీజుతో యూనివర్శిటీలోని ఏపీజే అబ్దుకలాం ప్రాంగణలో ఉన్న ప్రవేశాల సంచాలకుల కార్యాలయంలో హాజరు కావాలని సూచించారు. ఏపీ పీజీ సెట్ 2024 ఎంట్రెన్స్ రాసి అర్హత సాధించిన అభ్యర్థులు మాత్రమే ప్రవేశాలకు అర్హులన్నారు. ఇతర వివరాలకు వైవీయూ వెబ్‌సైట్‌లో సంప్రదించాలన్నారు.

ఖాళీల వివరాలు : ఇంగ్లీషు 35, తెలుగు 39, ఉర్దూ 26, జర్నలిజం 33, హిస్టరీ 29, పొలిటికల్ సైన్స్ 26, ఎకనామిక్స్ 41, కామర్స్ 37, బయకెమిస్ట్రీ 21, బయోటెక్నాలజీ 5, మైక్రో బయాలజీ 5, జెనెటిక్స్ అండ్ జీనోమిక్స్ 29, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ 31, బోటనీ 16, జువాలజీ 6, మ్యాథ్స్ 38, ఫిజిక్స్ 26, మెటీరియల్ సైన్స్ అండ్ నానో టెక్నాలజీ 34, కెమిస్ట్రీ 9, జువాలజీ 26, సైకాలజీ 24, ఫిజికల్ ఎడ్యుకేషన్ 38, ఫుడ్ టెక్నాలజీ 22, కంప్యూటరు సైన్స్ 13, కాంపటీషనల్ డేటా సైన్స్ 27 ఖాళీలు ఉన్నాయన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి : ఆర్డీఓ



నదిలో నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ

కమలాపురం రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వర్షాలు తగ్గేంత వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని.. లోతట్టు ప్రాంతీయులకు అవగాహన కల్పించాలని ఆర్డీఓ జాన్ ఎర్విన్ పాలపర్తి తెలిపారు. బుధవారం కమలాపురం తహసీల్దారు కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అధిక వర్షాలు కురుస్తున్నాయని.. రెవెన్యూ పరిధి అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రస్తుతం తుపాను ప్రభావం ఎక్కువగా ఉందని, ఎలాంటి నష్టాలు రాకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి అధికారిపై ఉందన్నారు. పెన్నా, పాపాఘ్ని నదుల పరివాహక లోతట్టు గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. వీఆర్వోలు సమాచారం సేకరించి కంట్రోలు రూముకు తెలపాలన్నారు. అనంతరం పెన్నా, కుందూ నది సమీపంలో నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దారు శివరామిరెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఫుడ్ టెక్నాలజిస్ట్స్ పాత్ర కీలకం



ఆహార కల్తీలను ఎలా గుర్తించవచ్చో వివరిస్తున్న విద్యార్థులు

పులివెందుల రూరల్, అక్టోబరు 16: (ఆంధ్రజ్యోతి): సరైన పౌష్టిక ఆహారంపై అవగాహన కల్పించడం, ప్రాసెసింగ్ శాతం పెంచడం, ఫుడ్ వేస్టేజ్ అరికట్టడంలో ఫుడ్ టెక్నాలజిస్ట్స్ పాత్ర కీలకమని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.మాధవ వివరించారు. బుధవారం స్థానిక ఆహార విజ్ఞానశాస్త్ర, సాంకేతిక కళాశాలలో ప్రపంచ ఆహార దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భవిష్యత్తు అంతా ఫుడ్ ప్రాసెసింగ్ రంగానిదే అన్నారు. అనంతరం కళాశాల విద్యార్థులు ఆహార కల్తీని ఎలా సులభంగా గుర్తించవచ్చో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఎల్‌బీఐ సెంటర్‌లో ఉన్న చిరుధాన్యాలు, పండ్లు ప్రాసెసింగ్ కోసం ఏర్పాటు చేసిన యంత్రాలు ఉపయోగ వివరాలను వివరించారు. కార్యక్రమంలో కడప ఫుడ్‌సేఫ్టీ ఆఫీసర్ డాక్టర్ ఎం.హరిత, పులివెందుల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కిషోర్‌బాబు, పులివెందుల ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఆర్.నాగరాజు, అధ్యాపకులు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఇసుక రీచ్ ప్రారంభం



బెడుదూరు వద్ద ఇసుక రీచ్‌ను ప్రారంభిస్తున్న తహసీల్దార్

కొండాపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెడుదూరు గ్రామం సమీపంలో చిత్రావతి నదిలో ఇసుకరీచ్‌ను బుధవారం తహసీల్దార్ గురప్ప ప్రారంభించారు. ఈ సందర్భంగా రీచ్ వద్ద కూటమి నాయకులతో కలిసి పూజ కార్యక్రమాలను నిర్వహించారు. ఇప్పటికే మండలంలో ఏటూరు, పి.అనంతపురం గ్రామాల వద్ద ఇసుకరీచ్‌లు ఉండగా బెడుదూరు వద్ద మరో రీచ్‌ను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇసుక రవాణా ప్రారంభమవుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎన్డీయే కూటమి నాయకులు అరుణ్ కుమార్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, నాగిరెడ్డి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అరటిలో ఆకుమచ్చ తెగులు నివారణకు చర్యలు తీసుకోండి



మాట్లాడుతున్న ఉద్యానశాఖ అధికారి రాఘవేంద్రారెడ్డి

వేముల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు అరటి పంటలో సిగటోక ఆకుమచ్చ తెగులు ఉధృతి పెరిగే అవకాశం ఉందని.. నివారణకు చర్యలు తీసుకోవాలని ఉద్యానశాఖ అధికారి రాఘవేంద్రారెడ్డి రైతులకు సూచించారు. బుధవారం మబ్బుచింతలపల్లెలో మండల వ్యవసాయాధికారి చెన్నారెడ్డి అధ్యక్షతన పొలం పిలుస్తోందిలో ఆయన మాట్లాడుతూ గెల వేయని చెట్లకు ప్రొపెకోనాజోల్ 2ఎంఎల్ లీటర్ నీటికి హార్టికల్చర్ మినరల్ ఆయిల్ 10ఎంఎల్ కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. గెల వేసిన చెట్లకు ప్రొపెకోనాజోల్, డిఫెనాకానాజోల్ మందు మిశ్రమాన్ని పిచికారీ చేసుకోవాలని, మందు పిచికారీ చేసిన తర్వాత మాత్రమే తెగులు సోకిన ఆకులను కోసివేయాలని, భూమిలోని తేమను చూసుకుని తోటకు నీరు పెట్టాలని తెలిపారు. ప్రస్తుతం వర్షాల తర్వాత యూరియా, పొటాష్‌ను డ్రిప్‌లో పంపించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌కే అసిస్టెంట్ మోహన్‌కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

రహదారులు.. రక్తసిక్తం



- నిర్లక్ష్యం, అతివేగంతోనే ప్రమాదాలు
- ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనదారులు
- నిత్యం ఎక్కడో ఒకచోట ప్రమాదం
- గాలిలో కలిసిపోతున్న ప్రాణాలు
- ట్రాఫిక్ రూల్స్ పాటిస్తేనే.. ప్రమాదాలు తగ్గుముఖం

కడప (క్రైం), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నిర్లక్ష్యం, అతివేగంతో ప్రతి నిత్యం ఎక్కడో ఒక చోట ప్రమాదం సంభవిస్తూ నిండు ప్రాణాలు కోల్పోతున్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించక పోవడం.. మితిమీరిన వేగంతో వాహనాలు నడపడం... ముఖ్యంగా యువత హైస్పీడుతో బైకులు నడుపుతుండటంతో వారితో పాటు ఇతరులు ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుంది. దీంతో రోడ్డు ప్రమాదాల్లో పిల్లలను కోల్పోయిన తల్లిదండ్రులు కడుపుకోత అనుభవించాల్సి వస్తోంది. అలాగే కుటుంబ పెద్దలను కోల్పోయిన పిల్లలు అనాథల్లా మారిపోతున్నారు. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటిస్తే ప్రమాదాల తీవ్రత తగ్గుతుందని అధికారులు చెబుతున్నారు.

చిన్నపాటి నిర్లక్ష్యానికి నిండు ప్రాణాలు బలి అవుతున్నాయి. తప్పు ఎవరిదైనా వాహనాలు నడిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు పాటించకపోతే మనతో పాటు ఇతరులు ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుంది. ప్రస్తుతం ఉన్న వాహనాలు హైస్పీడ్ కలిగి ఉండటం.. నిర్లక్ష్యం, అతివేగం, జాగ్రత్తలు పాటించక పోవడంతో ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు. ఇటీవల జిల్లాలో తరచూ ఎక్కడో ఒకచోట ప్రమాదాలు సంభవిస్తూ.. కుటుంబ సభ్యులు కడుపుకోత అనుభవించాల్సి వస్తోంది. ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించినప్పుడే ప్రమాదాల తీవ్రత తగ్గుతుంది. 50 స్పీడ్‌లో వెళ్లాల్సిన వారు 100, 120 స్పీడ్‌లో పోతే ఏ మాత్రం అదుపు తప్పినా ప్రాణాలు గాల్లోనే కలిసిపోక తప్పదు. వాహనదారుడు నిర్లక్ష్యం, ఓవర్ టేకింగ్, మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు రోడ్డు రవాణా శాఖా అధికారులు అవగాహన కలిగిస్తున్నప్పటికీ కొందరిలో మార్పు కనిపించడంలేదు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతూ ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు. అధికారులు మాత్రం ట్రాఫిక్ రూల్స్ తప్పనిసరిగా పాటిస్తేనే... ప్రమాదాలను నిరోధించే అవకాశం ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు.

వాహనదారులు జాగ్రత్తలు పాటించాలి



ప్రతి వాహనదారుడు వాహనం నడిపేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు అతివేగం, ఓవర్‌టేక్, మద్యం సేవించి డ్రైవింగ్ చేసేటప్పుడే ప్రమాదాలు సంభవిస్తాయి. ప్రమాదాలు జరిగినప్పుడు వారు ప్రమాదాలు కొని తెచ్చుకోవడమే కాక ఎదుటి వారి ప్రాణాలు కూడా తీసేందుకు కారణమవుతున్నారు. కావున ప్రతి డ్రైవరు జాగ్రత్తగా డ్రైవింగ్ చేస్తూ వారి గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకోవాలి. నగర శివార్లలో వాహనదారులకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పిస్తున్నాం.

-జావీద్, కడప ట్రాఫిక్ సీఐ

రోడ్డు ప్రమాదాలను గమనిస్తే...

- ఆగస్టు 26న అన్నమయ్య జిల్లా కడప జిల్లా బార్డర్ అయిన గువ్వల చెరువు ఘాట్ వద్ద కారును లారీ ఢీ కొన్న సంఘటనలో ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందారు.
- జూన్ 17న కడప నగరం రాజంపేట రోడ్డులోని గురుకుల బాలికల పాఠశాల వద్ద ఆర్టీసీ బస్సు, కారు ఢీకొన్న సంఘటనలో ముగ్గురు ప్రాణాలు విడిచారు.
- జూన్ 16న ఆర్టీసీ అద్దె బస్సు అలంఖాన్‌పల్లె సర్కిల్ సమీపంలోని పాత టోల్‌గేటు వద్ద ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ముగ్గురు యువకులు దుర్మరణం చెందారు.
- మార్చి 25న ఒంటిమిట్ట ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు స్పాట్ డెడ్.
- మే 15న కొండాపురం వద్ద లారీ, తుఫాను వాహనాన్ని ఢీకొట్టడంతో ఏడుగురి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. ఇటీవల సిద్దవటం పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు మహిళలు దుర్మరణం చెందారు. ఉమ్మడి జిల్లాలో ఇలాంటి ప్రమాదాలు రోజూ ఎక్కడో చోట జరుగుతూనే ఉన్నాయి. దీనికంతటికీ వాహనదారుల నిర్లక్ష్యం, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపమే ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి.

గండికోటకు మళ్లీ కృష్ణాజలాలు

- 4వేల క్యూసెక్కులు చేరిక
- వరదనీరు 2వేల క్యూసెక్కులు
- మైలవరం జలాశయానికి నీరు విడుదల



గండికోట నుంచి మైలవరం జలాశయానికి నీరు విడుదలవుతున్న దృశ్యం

కొండాపురం / మైలవరం అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అవుకు రిజర్వాయిర్ నుంచి బుధవారం గండికోట ప్రాజెక్టుకు 4 వేల క్యూసె క్కుల కృష్ణాజలాలు వస్తున్నట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. అదేవిధంగా రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకల ద్వారా ప్రాజెక్టులోకి మరో 2వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరింద న్నారు. ఇప్పటికే ప్రాజెక్టులో తగినంత నీటిమట్టం ఉండటంతో గేట్లు ఎత్తి మైలవరం జలాశయానికి 7500 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నామన్నారు. కాగా ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 26.2 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఆయన వివరించారు.

పెన్నాకు కొనసాగుతున్న నీటి విడుదల

మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి 8 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు జలాశయ డీఈఈ నరసింహామూర్తి తెలిపారు. గండికోట జలాశయం నుంచి నీరు వచ్చి మైలవరంలో చేరుతుండటంతో బుధవారం పెన్నాకు 8వేల క్యూసెక్కులు, ఉత్తర కాలువకు 30 క్యూసెక్కులు, దక్షిణ కాలువకు 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని తెలిపారు. వర్షాల కారణంగా మైలవ రానికి ఇన్‌ఫ్లో పెరిగితే మరింత నీటిని పెన్నానదికి వదిలే అవకాశం ఉందని.. పెన్నా పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.



మైలవరం జలాశయం నుంచి పెన్నాకు నీరు విడుదల చేస్తున్న దృశ్యం

మైలవరం జలాశయం పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 6.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం 6 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు.

ఉరి వేసుకుని మహిళ మృతి



సికెదిన్నె, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకుని నూకలబోయిన నాగలక్ష్మి (38) మృతి చెందినట్లు చింతకొమ్మదిన్నె సీఐ చంద్రశేఖర్‌నాయక్ తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం జమాల్‌పల్లెకు చెందిన నాగలక్ష్మి భర్త రవిచంద్ర ఏడేళ్ల కిందట మరణించాడని, ఒంటరితనం భరించలేక శ్వాస సంబంధిత వ్యాధితో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని చనిపోయినట్లు తెలిపారు. వీరికి ఇద్దరు పిల్లలున్నారని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీ.. వ్యక్తి మృతి



ఖాజీపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆంజనేయకొట్టాలకు సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని చంద్రశేఖర్‌రెడ్డి (60) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. ఆంజనేయకొట్టాలుకు చెందిన చంద్రశేఖర్ రెడ్డి పని నిమిత్తం వచ్చి తిరిగి ఇంటికి వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో కాలు విరగడంతోపాటు తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 ద్వారా కడప రిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మోహన్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జమ్మలమడుగు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణ శివార్లలో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో సున్నపురాళ్ల గ్రామానికి చెందిన పూజారి రాజేష్ (28) తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే అతన్ని అదే రోజు జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రి నుంచి మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించారు. తిరుపతిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతదేహాన్ని జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి బుధవారం తరలించి పోస్టుమార్టం నిర్వహించి.. కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

దాడి చేసిన నలుగురిపై కేసు నమోదు

మదనపల్లె అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బాకీ విషయమై దాడికి పాల్పడిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ చాంద్‌బాషా తెలిపారు. పోలీసుల సమాచారం మేరకు...

మదనపల్లె మండలం చిప్పిలి గ్రామం భువనేశ్వరీనగర్‌కు చెందిన జగదీష్ (27) దేవీవరప్రసాద్ వద్ద తన ద్విచక్రవాహనం కుదవ పెట్టి ఎనిమిది నెలల క్రితం రూ.40వేలు అప్పుతీసుకున్నారు. ఎన్నిసార్లు అడిగినా చెల్లించకపోవడంతో బుధవారం రాత్రి జగదీష్ మల్లికార్జున సర్కిల్‌లో ఉన్నాడని తెలుసుకుని దేవీవరప్రసాద్ తన మిత్రులు సురేష్, వెంకీ, బాస్కర్‌తో కలిసి దాడి చేసి కొట్టారు. ఈ మేరకు వన్‌టౌన్ సీఐ ఆ నలుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య



రామసముద్రం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తాగుడుకు బానిసై కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. రామసముద్రం మండలం భూసాని కురపల్లెకు చెందిన బుత్తన్నగారి శంకర(50) గత కొన్నేళ్లుగా తాగుడుకు బానిసై తరచూ కుటుంబ సభ్యులతో గొడవ పడేవాడు. ఈ నేపథ్యంలో గురువారం యథావిధిగా కుటుంబ సభ్యులతో గొడవపడి మనస్తాపం చెంది సీతరగానిపల్లె సమీపంలో పొలంలోని చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని శవపరీక్షల నిమిత్తం పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు.

కోడిపందెం రాయుళ్లు అరెస్టు

మదనపల్లె అర్బన్, అక్టోరు16: (ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణం, వీవర్స్ కాలనీ సమీపంలో కోడిపందెం ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపారు. బుధవారం స్థానిక వీవర్స్ కాలనీ సమీపంలో కోడిపందెం ఆడుతున్నట్లు సమాచారం రావడంతో టూటౌన్ ఎస్ఐ రవికుమార్, సిబ్బందితో అక్కడికి వెళ్లి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రెండు నాటు కోళ్లు, రూ.3020 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కారు ఢీ.. దంపతులకు తీవ్రగాయాలు

మదనపల్లె అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కారు బైకును ఢీకొన్న సంఘటనలో దంపతులు తీవ్రంగా గాయపడినట్లు మదనపల్లె వన్‌టౌన్ సీఐ చాంద్‌బాషా తెలిపారు. వివరాల మేరకు... మండలంలోని కోళ్లబైలు గ్రామపంచాయతీ, జగన్‌కాలనీకి చెందిన దంపతులు వెంకటరమణ (48), మేనక (42) ద్విచక్రవాహనంపై మదనపల్లె పట్టణానికి వచ్చారు. పనులు చూసుకుని తిరిగి ఇంటికి తిరుగు ప్రయాణంలో అమ్మచెరువు మిట్ట గంగమ్మగుడి వద్దకు రాగానే బైకును మదనపల్లెకు వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన దంపతులను జిల్లా ప్రభుత్వాస్పత్రికి చికిత్స కోసం స్థానికులు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆర్టీసీకి దసరా ఆదాయం రూ.59లక్షలు

కడప మారుతీనగర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ పురస్కరించుకుని వివిధ ప్రాంతాల నుంచి జిల్లాకు వచ్చిన ప్రయాణికుల ద్వారా రూ.59,38,002 ఆదాయం వచ్చిందని ఆర్టీసీ కడప రీజనల్ మేనేజరు పి.గోపాల్‌రెడ్డి తెలిపారు. ఈనెల 8వతేదీ నుంచి 11వ తేదీ వరకు సుమారు 283 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసి విజయవాడ, బెంగ ళూరు, హైదరాబాదు, చెన్నై, తిరుపతి, కర్నూలు తదితర ప్రాంతాల నుంచి జిల్లాకు ప్రయాణికులను రప్పించామన్నారు. దీంతో ఆయా బస్సుల ద్వారా ఈ ఆదాయం సమకూరిందన్నారు.

మందు రేట్లు తగ్గలే..!

మందుబాబుల అసంతృప్తి

పోరుమామిళ్ల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మద్యం ధరలు తగ్గిస్తామని చెప్పిన మాటలు హామీలకే పరిమితమయ్యాయి. బుధవారం జిల్లావ్యాప్తంగా పలుచోట్ల మద్యం దుకాణాలు ప్రారంభం అయ్యాయి. అయితే ఎక్కడా ప్రభుత్వం ప్రకటించిన మేరకు రూ.99కే మద్యం ఇవ్వలేదు. అన్నీ పాత ధరలకే అమ్మారు. చెప్పిందొకటి చేసేదొకటి అన్న రీతిలో మద్యం ప్రియులు విమర్శలు గుప్పించారు. పోరుమామిళ్లలో కొత్తగా నాలుగు మద్యం షాపులు మంజూరు కావడంతో ప్రభుత్వ దుకాణాలకు సీల్ వేశారు. దీంతో మధ్యాహ్నం 3గంటల వరకు మద్యం అందుబాటులోకి రాకపోవడంతో మందుబాబులు మద్యం కోసం షాపుల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చింది. మరికొందరు బ్లాక్‌లో అమ్మేవారి నుంచి కొనుగోలు చేశారు. సాయంత్రం అయ్యేసరికి మందుబాబులంతా మద్యంషాపుల వద్ద గుమికూడారు. ఎక్సైజ్ అధికారులు ఎమ్మార్పీ ధరల పట్టిక ఏర్పాటు చేయలేదు. గోడౌన్ నుంచి పూర్తిస్థాయిలో మద్యం సరపరా కాకపోవడంతో షాపులు దక్కించుకున్న వారు అధికారుల ఆదేశాలు వచ్చేంత వరకు పాత ధరలనే కొనసాగించనున్నారు. రూ.99కే మద్యం అందకపోవడంతో మద్యంప్రియుల నుంచి అనేక విమర్శలు వెల్లువెత్తాయి.

వైభవంగా పట్టాభిరాముడి పవిత్రోత్సవాలు



వాల్మీకిపురం పట్టాభి రామాలయంలో మూల వర్ల సమర్పణకు పవిత్రాలు తీసుకెళ్తున్న అర్చకులు

వాల్మీకిపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణంలో వెలసిన పట్టాభిరామాలయంలో టీటీడీ ఆధ్వర్యంలో రెండు రోజులుగా పవిత్రోత్సవాలను ఎంతో వైభవం గా నిర్వహిస్తున్నారు. బుధవారం ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవలతో ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం ఆలయ మండపంలో ప్రతిష్ఠించిన పవిత్రాలకు పూజలు నిర్వహించి, హోమాది కార్యక్రమాలు పూర్తి చేశారు. మంగళవాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ పవిత్రాలను ప్రదర్శనగా తీసుకెళ్లి ఆలయంలోని మూలవర్లకు, సీతాలక్ష్మణ సమేత పట్టాభిరాములకు పూజలు నిర్వహించారు. పవిత్రాల అలంకరణలో ఉన్న స్వామి వారిని భక్తులు దర్శించారు. పవిత్రోత్సవాలలో భాగంగా చి వరిరోజు గురువారం ఉదయం హోమం, మహా పూర్ణాహుతి, కుంభ సంప్రోక్షణ, పవిత్రాల వితరణ, చక్రస్నానం, సాయంత్రం విశేష అలంకరణలతో సీతారామలక్ష్మణులు తిరువీధి ఉత్సవం కార్యక్రమాలు జరగనున్నాయి. కార్యక్రమాలలో టీటీడీ ఏఈవో గోపినాథ్, డిప్యూటీ ఈవో వరలక్ష్మి, సూపరింటెండెంట్ మునిబాల, ఆగమ సలహాదారు శ్రీనివాసాచార్యులు, ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు, అర్చకులు కృష్ణప్రసాద్‌భట్టార్, కృష్ణ రాజుభట్టార్, ధను ష్, బాషికాచార్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ దుకాణాల నుంచి మిగులు మద్యం స్వాధీనం

కలికిరి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మద్యం దుకాణాల గడువు ముగియడంతో ఆయా దుకాణాల్లో అమ్మకాలు నిలిచిపోవడంతో మిగిలిన మద్యాన్ని ఎక్సైజ్ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. వాల్మీకిపురం ఎక్సైజ్ సీఐ కేఎస్ లత ఆధ్వర్యంలో మిగిలిన మద్యానికి సంబంధించిన లెక్కలను తనిఖీ చేసి ఆ మేరకు స్టాకును స్వాధీనం చేసుకున్నారు. బుధవారం నుంచి ప్రైవేటు మద్యం దుకాణాల్లో అమ్మకాలు ప్రారంభించిన కారణంగా ప్రభుత్వ దుకాణాల్లో మిగిలిపోయిన వివిధ రకాల మద్యం సీసాల స్టాకును స్వాధీనం చేసుకుంటున్నట్లు సీఐ చెప్పారు. కలికిరిలో వున్న మూడు ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి మిగిలిన స్టాకును స్వాధీనం చేసుకునే కార్యక్రమం బుధవారం రాత్రికిగానీ పూర్తి కాలేదు. ఎక్సైజ్ ఎస్ఐ సుభాషిణి, సిబ్బంది పాల్గొన్నారు.

తుఫానుతో ఎడతెరపిలేని వర్షం

● పంట పొలాల్లోకి నీరు... రైతన్నలకు తీవ్ర నష్టం ● పలు మండలాల్లో ప్రజలను అప్రమత్తం చేసిన అధికారులు





పెద్దపాళ్యంలో టమోటా పంటలోకి వచ్చిన నీరు, పెద్దేరు ప్రాజెక్టును పరిశీలిస్తున్న తహసీల్దారు హరికుమార్, బడికాయలపల్లె చెరువును పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ తహశీల్దార్ తదితరులు

ములకలచెరువు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): తుఫాను కారణంగా ములకల చెరువు మండలంలో ఎడతెరపిలేని వర్షం కురుస్తోంది. దీంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. ఇళ్లలో నుంచి జనం బయటకు రావడానికి వీలు లేకండా పోయింది. అలాగే వాగులు, వంకలు పొంగి పొర్లాయి. పంట పొలాల్లో వర్షపు నీరు నిలిచాయి. పెద్ద పాళ్యం సమీపంలో రైతు శ్రీనివాసులు పొలంలో వర్షపు నీరు భారీగా చేరాయి. మండంలోని పలు గ్రామాల్లో నీరు పంటల్లోకి నీరు చేరాయి. ములకలచెరువులోని ముంబాయి-చెన్నై జాతీయ రహదారి పక్కన పలు చోట్ల పెద్ద ఎత్తున వర్షపు నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది.

తంబళ్లపల్లె: తుఫాను కారణంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో తహసీల్దారు హరికుమార్, ఇరిగేషన్ డీఈ సురేష్‌బాబు, ఏఈ సతీష్‌కుమార్‌తో కలసి బుధవారం పెద్దేరు, చిన్నేరు ప్రాజెక్టులు, గోపిదిన్నె చెరువులను సందర్శించారు. ప్రాజెక్టుల గేట్లు, కట్టలు, తూములును పరిశీలించారు. ప్రాజెక్టుల నీటి సామర్థ్యం, నీటి ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లో తదితర వివరాలను ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వర్షాలు ఉన్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ప్రాజెక్టులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని సూచించారు. కాగా, తుఫాను కారణంగా తంబళ్లపల్లెలో గత రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా ఓ మోస్తారు వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం తంబళ్లపల్లెలో 22.4 మి.మీ వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

బి.కొత్తకోట: మండలంలో తుఫాను కారణంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. మండల వ్యాప్తంగా వర్షతీవ్రతపై ఆయా ప్రాంతాల రెవెన్యూ సిబ్బందిచే నిఘా పెట్టారు. తుఫాను నేపథ్యంలో మండలంలోని బడికాయలపల్లె, గుమ్మసముద్రం, గట్టు, తరిగోడు చెరువులను ఇన్‌చార్జ్ తహశీల్దార్ మహమ్మద్ అన్సారీ, ఎంపీడీవో శంకరయ్య, ఇరిగేషన్ అధికారులు పరిశీలించారు. ప్రజలకు ఏ ఇబ్బంది కలగకుండా ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా వున్నామని పేర్కొన్నారు.

ఎంపీడీవోగా అబ్దుల్‌కలాం ఆజాద్



పెద్దతిప్పసముద్రం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల నూతన ఎంపీడీవోగా అబ్దుల్ కలాం ఆజాద్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ ఎంపీడీవోగా విధులు నిర్వర్తించిన కె.ఎన్.బాలాజీ ఉమ్మడి చిత్తూరు జిల్లా పెద్దపంజాణి మండలానికి బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో అబ్దుల్‌కలాం ఆజాద్ నూతనంగా వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఉన్న ప్రజాప్రతినిధులు, అధికారులను సమన్వయం చేసుకుని మండల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

19న డయల్ యువర్ డీఎం

మదనపల్లెఅర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక వన్ అండ్ టూ డిపోలో శనివారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎం వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. ప్రయాణికులు, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

22న ఐటీఐలో జాబ్‌మేళా

తంబళ్లపల్లె, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 22న (మంగళవారం) జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్, జిల్లా ఉపాధి, డీఆర్‌డీఏ సీడప్ ఆధ్వర్యంలో ఈ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రముఖ ప్రైవేటు కంపెనీలు హాజరవుతాయని, పదో తరగతి నుంచి డిగ్రీ వరకు చదివిన 18-30 సంవత్సరాల వయసు వారు అర్హులన్నారు.

శబరిమలకు మూడు కొత్తబస్సులు

మదనపల్లె అర్బన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మదనపల్లె వన్ డిపో నుంచి కేరళలోని శబరిమలకు మూడు కొత్తబస్సులు నడుపుతున్నట్లు ఆ డిపో మేనేజరు మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం ఇక్కడి నుంచి ఒక బస్సును, అదే రోజు సాయంత్రం రెండు కొత్తబస్సులను అయ్యప్పస్వామి భక్తులతో బయలుదేరి వెళ్లినట్లు చెప్పారు. శబరిమల సీజన్‌లో భక్తుల కోసం కొత్తబస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. భక్తులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, సురక్షిత ప్రయాణం ఎంచుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం : జయచంద్రారెడ్డి

పెద్దమండ్యం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) ప్రజా సంక్షేమం, అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని నియోజకవర్గ టీడీపీ నేత జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. మండలంలో బుధవారం 'పల్లె పండుగ' కార్యక్రమంలో రూ.8 లక్షలతో సీసీ రోడ్లకు భూమి పూజ జరిగింది. ఈ సందర్భంగా దిగువపల్లి గ్రామంలో సర్పంచ్ బండి వాసవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జయచంద్రారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ సయ్యద్‌అహ్మద్, ఎంపీడీవో శ్రీధర్‌రావు, ఏపీడీ మధు, ఏపీవో మురళి, తంబళ్లపల్లి సమన్వయకర్త మల్లికార్జున, శంకర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అశోక్, హౌసింగ్ ఏఈ అక్రం, కార్యదర్శులు జగన్, జనార్ధన, కూటమి నేతలు యుగంధర్‌రెడ్డి, విశ్వనాధరెడ్డి, గంగాధర, కాలేషా, మహేశ్వర పాల్గొన్నారు.

తంబళ్లపల్లె: కూటమి ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని నియోజకవర్గ టీడీపీ నేత జయచంద్రారెడ్డి అన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మొదటి విడతలో మండలంలో రూ.32 లక్షలతో సీసీ రోడ్లకు తంబళ్లపల్లె, రెడ్డికోటల్లో భూమి పూజ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త మల్లికార్జుననాయుడు, మండలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, సిద్దమ్మ, పార్లమెంటు బీసీ సెల్ అధ్యక్షుడు సోము శేఖర్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు రామచంద్ర పాల్గొన్నారు.

కురబలకోట: రాష్ట్రంలోని ప్రతి గ్రామాలకు పల్లెపండుగతో మహర్దశ పట్టనున్నట్లు నియోజకవర్గ నేత జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పిచ్చలవాండ్లపల్లెలో పల్లెపండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ సమన్వయకర్త మల్లికార్జుననాయుడు, సర్పంచ్ సురేంద్ర, మాజీ ఎంపీపీ భూమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బి.కొత్తకోట: మండలంలోని గట్టు గ్రామంలో జరిగిన పల్లె పండుగ కార్యక్రమంలో జయచంద్రారెడ్డి పాల్గొన్నారు. డ్రైనేజీ నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకరయ్య, మల్లికార్జుననాయుడు, మొటుకుశివ పాల్గొన్నారు.

మిట్స్ ప్రిన్సిపాల్‌కు అవార్డు ప్రదానం



కురబలకోట, అక్టోబరు 16: మండలంలోని అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌కు ఐఎస్‌టీఈ (ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషనల్) బెస్ట్ ప్రిన్సిపాల్ అవార్డుకు ఎంపికైయ్యారు. కళాశాలలో ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న యువరాజ్ నాణ్యమైన విద్యాప్రమాణాలను, రీసెర్చ్ ఫండింగ్, నాక్ ఏ ప్లస్ తదితర వాటిని పరిగణలోకి తీసుకుని అవార్డులను ప్రదానం చేశారు. కాగా రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ సాధించడంతో జి.కృష్ణకుమార్ స్మారక అవార్డుకు ఎంపిక చేశారు. ఈయనకు ఈ నెల 25న కర్నూల్ పుల్లారెడ్డి కళాశాలలో అవార్డును అందజేస్తారన్నారు.

సిమెంటు రోడ్డుకు భూమి పూజ

పీలేరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): 'పల్లె పండుగ' కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎర్రగుంట్లపల్లె పంచాయతీ హెరిటేజ్ ఫ్యాక్టరీ ఎదురుగా ఉన్న చౌడేశ్వరి నగర్‌లో సీసీ రోడ్డుకు అధికారులు, ప్రజాప్రతినిధులు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ ఏపీవో మహేశ్ మాట్లాడుతూ రూ.8 లక్షలతో సీసీ రోడ్డు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్, ఇరిగేషన్ శాఖాధికారులు, టీడీపీ నాయకులు అమరనాథరెడ్డి, కప్పరం చంద్రయ్య, ధర్మరాజు, ఎల్లప్ప, ఎర్రయ్య రమేశ్ నాయక్ పాల్గొన్నారు.

మండల సమావేశం వాయిదా

కలకడ, అక్టోబరు 16: మండల సర్వసభ్య సమావేశానికి తగిన సంఖ్యలో ఎంపీటీసీ సభ్యులు హాజరుకానందున బుధవారం జరిగాల్సిన మండల మీట్ కోరంలేక వాయిదా పడింది. ఎంపీపీగా వైసీపీకి చెందిన శ్రీదేవి కొనసాగుతున్నారు. మండలంలో మొత్తం 11 మంది ఎంపీటీసీ సభ్యులు ఉండగా వైసీపీ తరఫున 8 మంది ఎంపీటీసీలు ఉన్నారు.

పీలేరులో లఘుచిత్ర నిర్మాణం



పీలేరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): 'విరామం' పేరుతో నిర్మితమవుతున్న ఓ లఘు చిత్ర నిర్మాణ కార్యక్రమం బుధవారం పీలేరులో ప్రారంభమైంది. మండలంలోని ఎర్రగుంటపల్లె ఆంజనేయస్వామి ఆలయంలో లఘు చిత్ర నిర్మాత, దర్శక, నటీనటులు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా పీలేరుకు చెందిన ప్రముఖ నటుడు, ఎన్టీఆర్ లెజండరీ అవార్డు గ్రహీత 'కళ' ఖాదర్‌బాషా మాట్లాడుతూ పూర్తిగా పీలేరు ప్రాంతానికి చెందిన సినీప్రియులతో లఘుచిత్రాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. పీలేరుకు చెందిన విజయకుమార్ నిర్మాతగా, ఎస్.కె.సురేశ్ దర్శకుడిగా ఉన్నారు. పీలేరు, ఎర్రగుంటపల్లె, బండకిందపల్లె పరిసర ప్రాంతాల్లో జరిగే రెండు షెడ్యూళ్లలో చిత్ర నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు.

తెరుచుకున్న కొత్త మద్యం షాపులు

● బారులు తీరిన మద్యం ప్రియులు

పీలేరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ నూతన మద్యం పాలసీ మేరకు పీలేరులో బుధవారం మూడు కొత్త మద్యం దుకాణాలు తెరుచుకున్నాయి. మండలానికి ఆరు మద్యం దుకాణాలను ప్రభుత్వం కేటాయించగా నాలుగు దుకాణాలను స్థానికులు, రెండు దుకాణాలను నంద్యాలకు చెందిన వ్యాపారులు దక్కించుకున్నారు. వాటిని బుధవారం ప్రారంభించాల్సి ఉండగా గదులు అందుబాటులో లేకపోవడంతో ముగ్గురు మాత్రమే బుధవారం దుకాణాలు ప్రారంభించారు. స్థానిక అజంతా టాకీసు మిట్ట, తిరుపతి రోడ్డులోని ఐసీఐసీఐ బ్యాంకు, కడప రోడ్డులోని సైనిక్ నగర్ శివారు ప్రాంతంలో మూడు దుకాణాలు ప్రారంభమయ్యాయి.

సీఎం సహాయనిధికి విరాళం

మదనపల్లెటౌన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): విజయవాడ వరద బాధితుల సహాయార్థం మదపల్లెకు చెందిన చర్చి ఫాస్టర్లు ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు రూ.10,116 డీడీని అందజేశారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే నివాసంలో గ్లోరీ ఫాస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు బోనాజ్ జాన్‌బాబు ఆయనను కలిసి అందించారు. కార్యక్రమంలో చర్చి ఫాస్టర్లు, టీడీపీ నాయకుడు శ్రీరాములు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ చేయాలి

మదనపల్లెటౌన్,అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో విజయ డెయిరీని ఎన్‌డీడీబీ కింద అభివృద్ధి చేస్తామని అప్పటి సీఎం జగన్ రూ.2వేల కోట్ల రుణాలు తీసుకుని, దుర్వినియోగం చేశారని దీనిపై కూటమి ప్రభుత్వ విచారణ చేపట్టాలని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ కోరారు. బుధవారం స్థానిక నిమ్మనపల్లె సర్కిల్ వద్ద ఆయన విలేకర్లతో మాట్లాడారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

గుర్రంకొండ, అక్టోబరు 16: తుఫాన్ ప్రభావంతో గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులు పడకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో వెంకటేశులు సూచించారు. తుఫాన్‌తో కురుస్తున్న వర్షాలకు చెరువులు, కుంటలను పరిశీలించి తగు జాగ్రత్తలను తీసుకోవాలన్నారు. అధికారులు ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

కలకడ, అక్టోబరు 16: అధిక వర్షాలు కారణంగా గ్రామాల్లో చిన్న చిన్న సమస్యలను పరిష్కరించాలని ఎంపీడీవో అబ్దుల్ రహీం సిబ్బందిని ఆదేశించారు. కార్యాలయంలో బుధవారం ఆయన తుఫాన్ పరిస్థితులపై అధికారులు, కార్యదర్శులతో సమీక్షించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఫణికుమార్, ఈవోఆర్డీ వెంకటసుబ్బయ్య, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

వాల్మీకిపురం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): తుఫాను కారణంగా వాల్మీకిపురం సర్కిల్ పరిధిలోని గుర్రంకొండ, వాల్మీకిపురం మండలాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అత్యవసర పరిస్థితుల్లో సహాయం కొరకు 9440796714, 9440900712, 9440900714 నెంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం



పనులు ప్రారంభిస్తున్న పాలగిరి సిద్ధా

ములకలచెరువు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా పేర్కొన్నారు. మండలంలోని పాత ములకలచెరువులో బుధవారం పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా సీసీ రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన మూడు నెలల వ్యవధిలోనే అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి, నాయకులు శివన్న, విజయ్‌కుమార్, భూపతి, రామకృష్ణ, వెంకటరమణ పాల్గొన్నారు.

'విధులకు డుమ్మా కొడితే ఎలా..?'

మదనపల్లెటౌన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయ సిబ్బంది ఉన్నతాధికారుల అనుమతి లేకుండా డుమ్మా కొడితే ఎలా అంటూ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ప్రశ్నించారు. బుధవారం మండలంలోని చీకిలబైలు గ్రామ సచివాలయాన్ని ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇద్దరు సచివాలయ ఉద్యోగులు విధులకు గైర్హాజరవడంపై ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలకు సేవలందించేందుకు అందుబాటులో వుండాల్సిన ఉద్యోగులు నిర్లక్ష్యంగా విధులు నిర్వహించడంపై విచారించి తగు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో మస్తాన్‌వలికి ఫోన్ చేసి సూచించారు. ఈ కార్యక్రమంలో చీకిలబైలు సర్పంచ్ ప్రభాకర్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆదర్శంగా తీర్చిదిద్దడమే ధ్యేయం

వాల్మీకిపురం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాలను ఆదర్శంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ధ్యేయమని మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. బుధవారం పుల్లేటిచెరువుపల్లె, చారావాండ్లపల్లె, బోయపల్లె గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమాలలో ఎంపీడీవో మనోహర్‌రాజు, టీడీపీ పీలేరు తెలుగు యువత ఉపాధ్యక్షుడు మధు, నాయకులు వెంకటరమణ, సుధాకర్‌రెడ్డి, గిరిబాబు, కువైత్ ఆదినారాయణ, జేకేనాయుడు, అధికారులు, గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

కండక్టర్లకు అభినందన

మదనపల్లెఅర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె-తంబళ్లపల్లె రూట్‌లోని స్థానిక వన్‌డిపో కార్యాలయంలో బుధవారం జీఆర్‌ఈ సమావేశం ఆ డిపో మేనేజరు వెంకటరమణారెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మార్గంలో ఎక్కువగా ఈపీకే సాధించిన కండక్టర్లను అభినందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజరు రేవతి, సూపర్‌వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

వామ్మో ఎంత పెద్ద చేప..!



కురబలకోట, అక్టోబరు16: మండలంలోని అంగళ్లు సమీపంలోని మొలకవారిపల్లె చెరువులో పెద్దచేప బుధవారం లభ్యమైంది. గత 3 రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఈ చేప చెరువులో కమతం పల్లెకు చెందిన గంగిరెడ్డి కంటపడింది. దీంతో ఆయన ఆ చేపను పట్టుకున్నారు. ఇది ఒక మీటరు పొడవు, 7 నుంచి 10 కిలోల బరువు ఉంది. దీన్ని చూసిన స్థానికులు వామ్మో ఇంత పెద్దచేపా అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు.